PRAMUKHANDHRA 27th Year of Publication We carry the news and views of Telugus

వ్యవస్థాపకులు
శ్రీ గోపేటి శ్రీ రామారావు

ప్రముఖాంధ్ర

27 వ సంవత్సరం
₹.15
ఫిబ్రవరి 2021



THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA, GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA

సాయిరాం సాయిరాం ! కరుణించి మమ్మేలు సాయిరాం !

కరోనా తగ్గుముఖంలో తృప్తిగా సాగిన షిర్డి యాత్ర.

నా వద్దకు వచ్చేవాళ్ళను నేనే పిచుకకు దారం కట్టి లాగినట్టు లాగుకుంటాను అన్నారు శ్రీ సాయిబాబా. ఎవరు అదృష్టవంతులో, ఎవరి పాపములు క్షీణించినవో వారే నన్ను భజించుటయందు తత్పరులై నన్నెరుగగలరు. సాయి సాయీ అని స్మరిస్తే సప్తసముద్రములు దాటిస్తాను. నా మాటలను విశ్వసింపుము. నాకు పూజతంతుతో పనిలేదు, షోడశోపచారములు, అష్టాంగయోగములతో పనిలేదు. కావలసిందల్లా భక్తి, నా మాటలపై నమ్మకం, అచంచల విశ్వాసం.పూర్తిగా శరణాగతి. ఇవన్ని సాయిరాముడు చెప్పినవి.కొన్ని సంవత్సరాలుగా మా కుటుంబసభ్యులందరం సాయి భక్తులం, అందరం షిర్డీ కి 2003 లో మొట్టమొదటిసారిగా వెళ్ళాము. తరువాత బాబా దగ్గరికి సంవత్సరానికి ఒకసారైనా వెళ్ళొస్తాను. నాన్నగారు మా ఇంటికి "శ్రీ వెంకటసాయి నిలయం "అని పేరు పెట్టారు.ప్రతి సంవత్సరం ఒకమారైనా తిరుమల, షిర్డీ వెళ్ళడం ఆ దైవాలను దర్శించుకుని, విన్నవించుకోవలసినవి విన్నవించుకుని రావడం ఆనవాయితిగా పెట్టుకున్నా. ఈ కొరోనా ప్రభావంవల్ల వెళ్ళలేకపోయా , ప్రభుత్వాలు కాస్త వెసులుబాటు కల్పించాక తిరుమల వెళ్ళి ఆ వెంకటేశ్వరుణ్ణి , మొన్న సంక్రాంతి కి షిర్డీ వెళ్ళి సాయినాథుణ్ణి దర్శించుకున్నాను. జనవరి 14, 15, 16, మూడురోజులూ షిరిడీలోనే సాయి సమక్షంలోనే గడిపేసాను. అన్ని ఏర్పాట్లు ఆన్ లైన్ లోనే జరిగిపోయాయి. పరిమితంగా భక్తులను అనుమతిస్తునందు వల్ల తృప్తిగా దర్శనం. ఇక హారతికైతే ఆ మొత్తం హాలుకి 50 మందిమే వున్నాం. ప్రశాంతంగా, ఏ అడ్డులేకుండా, ఎవరు తోసెయ్యకుండా , కనిపించటంలేదని కాలి నునివేళ్ళపై నిలబడటంలాంటివి లేకుండా చక్కగా, తృప్తిగా, మనసుకి హాయిగా దర్శనం చేసుకున్నాను. నేను వున్న హొటల్ సెంట్ లారన్ యజమని బాబా భక్తుడు, ఆ రెండు ఎకరాల ఆవరణలోనే బాబా మందిరం , ద్వారకామాయి , గురుస్థాన్ నమూనాలలో నిర్మించి అక్కడ పూజలు, హారతులు జరుగుతున్నాయి. ఒక చక్కటి మెడిటేషన్ హాల్ కుడా వుంది.మందిరం నుండి రావడం ఇక హొటల్ లో ఆ చక్కని వాతావరణంలో మూడురోజులు సంతోషంగా గడిపేసాను.సాయి ఎంతటి కరుణాంత హృదయుడో సాయి అంటే ఓయి అని పలుకుతూ నమ్మినవారిపట్ల తన ఏకదశ సూత్రాలను మనసున తలచినంతనే కరుణిస్తూ కాపాడుతున్నాడు. షిరిడీ యాత్ర అంత ఆహ్లాదకరంగా జరిగినందుకు మరొక్కమారు కృతజ్ఞతాపూర్వకంగా ముకుళిత హస్తాలతో నమస్కరిస్తూ సర్వస్య శరణాగతి చేస్తున్నాను.

-మీ
గోటేటి వెంకటేశ్వరరావు
pramukhandhra95@gmail.com

ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

ఫిబ్రవరి 2021

సంపుటి : 27 **314** సంచిక : 2

హిందువుల్లోని అనైక్యత హిందూత్వ అణచివేతకు గురియవుతూంది!

హిందూ మతం అన్నది ఏ మతాచార్యుడూ స్థాపించలేదు. హిందూదేశం అన్న పేరు ఏ మతాచార్యుడూ పెట్టినది కాదు. అన్య దేశస్థులే! 'ఇండియా' అన్నదీ అన్యదేశస్థులే! మనకు స్వంత బుద్ధీ, స్వంత తెలివితేటలూ లేనందువల్లనో, దాస్య జీవితానికి అలవడినందువల్లనో స్వంత మనఃస్తత్వాన్నీ, వ్యక్తి స్వాతంత్ర్యాన్నీ కోలుపోయాం. రెండూ, మూడు వందల సంవత్సరాలు పరుల పాలనలో బ్రతికాము, 62 (74) సంవత్సరాలుగా స్వపరిపాలనలోనూ బ్రతుకుతున్నాం. అప్పుడూ, ఇప్పుడూ పరతంత్ర, భావాల నికృష్టులుగానే బ్రతుకుతున్నాం.

మనది భారతదేశమనిగానీ, మనం భారతీయులమని యనెడి భావనగానీ మనలో లేదు. 'హే భారతా, ఏ కౌంతేయా – యని పరమపావన గ్రంథమైన 'భగవద్గీత'లో గీతాచార్యుడు సహితమూ సంబోధించాడే తక్క మరో 'హిందువా' అని పిలువలేదు, అప్పటికి మనపై ఇస్లాము, ఇంగ్లీషు వాళ్ల ప్రభావం లేకపోవడమేమో! నేనెరింగినంతవరకూ మనల్ని, మన పొరుగుల్నీ సర్వమానవ సర్వ జంతు, సర్వపక్షి కీటక, ధర, జల, వాయు చరాల మధ్య సౌభ్రాతృత్వం, ఫలపుష్ప, వృక్ష ఆరాధనం, నరవానర సమ్మేళనా మైత్రీ విధానాన్నీ ఆచరిస్తూ, 'రామాయణం' బోధించిన ప్రాతిపదికగా, ధర్మసూత్రంగా వర్ధిల్లింపచేసింది, సాగరాంతర దేశాల్లో కూడా ఆరాధనా గ్రంధమైంది. అదే మానవునికి పరమ పవిత్రమైన గ్రంథం. ఇహ భారతం పంచమవేదం. భారత–ఇతి–మహాగ్రంథం మహా భారతం, మత్సరం, అసూయ, క్షమారహితములూ, కామ మోహితములూ మానవుల్నీ, అందునా రక్తసంబంధీకుల్ని సహితమూ ఏవిధంగా మట్టుబెట్టిస్తుందో తెలిపిన గ్రంథం. మానవుడు కర్తవ్య నిర్వాహకుడనీ 'కర్మణ్యా వ్యాధికారస్తే మాఫలేషు' – అంటూ ఫలితం ఆశించకుండా ధర్మాచరణం చేయ్. ధర్మపాలనమే నిన్ను కాపాడుతూందని బోధించిన భారతాంర్గత భగవద్గీత, అనుశాసనిక పర్వంలోని భీష్మ బోధనంలోనూ ద్యోతకం అవుతుంది. అంటే ముందుగా మనకు ధర్మం పుట్టింది, ధర్మాచరణం కావించమన్నది. దానినే మనం సనాతన ధర్మంగా భావిస్తూ ఆరాధిస్తు వస్తున్నాం. ఋషుల ప్రోక్తంలోగానీ, మునులు, మతాచార్యుల బోధనంలోగానీ ధర్మాచరణమే మూలభూతం తక్క, ఏ సత్పురుషుడూ, ఆచార్యుడూ మనపై మతాన్ని రుద్దలేదు. వ్యాసుడు, కృష్ణుడు, శంకరాచార్యులు, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు వంటి వారందరూ ధర్మాలనే బోధించారు. అదే భారతీయ సనాతన ధర్మం.

కృష్ణుడు గానీ, క్రీస్తుగానీ, మహ్మద్ ప్రవక్త గానీ మరో నానక్ గానీ మతాలను స్థాపించలేదు. వారి వారి అభిమతాల్ని అభిమానించిన వారు మతాలుగా ప్రచారం చేసుకుంటూ వచ్చారు. ఏ మతమూ అధర్మాన్ని, అహింసను, అక్రమాన్ని, ఆధిపత్యం వహించ మనలేదు. అందుకనే భారతంలో –

"ఒరులేమేమి యొనర్చిన
నరవర! యప్రియము దనమనంబున కగుఁదా
నొరులకు నవి చేయకునికి
పరాయణము పరమధర్మపదములకెల్లన్ ॥

– ధర్మరాజా! ఇతరులు ఏఏ పనులు ఆచరిస్తే, తన మనస్సుకు అప్రియంగా ఉంటుందో, అటువంటి అహిత పనులను తాను పరులకు చేయకుండుట పరమధర్మం సుమీ – యని చెప్పించారు. సర్వ ధర్మాల సారంగా, సర్వజీవుల జీవన ప్రశాంతకరంగా ధర్మం సర్వేజనాస్సుఖినో భవన్తు – అనే సూక్తంగా సనాతన ధర్మం నడుస్తూంది, నడి పిస్తూంది. **సర్వదేవ నమస్కారం కేశవప్రతి గచ్ఛతి** – అన్నది భరతవర్ష జనులు విశ్వసించే ధర్మం.

ఈ సనాతన ధర్మసారాన్ని ఇతర దేశాలు ఆచరిస్తూ – వారి వారి మతధర్మాలుగా మలచుకున్నాయ్; అలవరచుకున్నాయ్. భారతదేశంలో ఏఁవి పోయేకాలం వచ్చిందోగానీ సనాతన (వేల సంవత్సరాల ధర్మాన్ని) ధర్మాన్ని హిందుత్వం అంటూ ద్వేషిస్తున్నారు. ఇది రాజకీయంగా రాజకీయాల్లో ప్రబలుతున్న కుళ్లు, ప్రలోభాలకు గురియై ఇతర మత తీర్థం తీసుకున్న స్వదేశ జనితులూ రాజకీయ పక్షవాతులూ పలికే మాట. ఇక్కారణంగానే మనవారే మన మతాన్ని అణచి వేయబూనడం గర్హనీయంగా లేదూ!



బుధజన విధేయుడు
– గోటేటి శ్రీరామారావు
(జులై 2009, ప్రముఖాంధ్ర)

Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com
YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-

శివుడే ఐశ్వర్యప్రదాత!

త్రిజగాల్లోని త్రిమూర్తుల్లో ఐశ్వర్యప్రదాత, అభయప్రదాత ఎవరంటే పరమశివుడనే చెప్పాలి. ఆయన్ను భోళాశంకరుడని కూడా చెప్పుకోవాలి. సురులకుగానీ, అసురులకుగానీ, గంధర్వులకు గానీ కోరిన వెంటనే వరాలిచ్చేవాడు శివుడే! అందుకే ఆయన్ను పరమశివుడన్నారు, పరమేశ్వరుడన్నారు. తన వరంతో ఏదైనా భస్మం కావాలని వరం కోరిన భస్మాసురునికి కూడా వరం యిచ్చిన ఉదారుడు. కన్నడనే మూఢభక్తి గల బోయవానికి సహితమూ ముక్తిని ప్రసాదించిన మహాదేవుని క్షేత్రమే శ్రీ కాళహస్తి క్షేత్రం. మార్కండేయుడనే బాలుణ్ణి, యమపాశాల బారి నుంచీ రక్షించి చిరాయుష్మంతుణ్ణి చేసిన శంకరుడు భోళాశంకరుడు గాక మరెవ్వరు?

తన్ను తపస్సుతో మెప్పించిన పర్వతరాజ పుత్రిక పార్వతిని పరిణయమాడి తన శరీరంలో అర్ధభాగం యిచ్చి, అర్ధాంగిగా చేసుకుని, స్త్రీ జాతి మోక్షప్రదాతయిన వాడు, పరమశివుడే!

శివుణ్ణి సేవించే భక్తుల కోసం విశ్వనాధుడై కాశీ క్షేత్రంలో కలి యుగాంతం వఱకూ ఉంటానని 'బాస' చేసి, కాశీలో విశాలాక్ష్మీ, అన్నపూర్ణ, గంగాదేవిలతో కలిసి, వెలసి, కలిదోష ప్రభావానికి ఎరగాకుండా, యుగాంతం వరకూ అక్కడే ఉండి, మోక్షం ప్రసాదించుదునని బాస చేసి కొలువు ఉన్నవాడు విశ్వనాధుడు. కాశీలో మరణిస్తే కైలాసప్రాప్తి కలుగుతుందని బాస చేసి ఎందరో భావించి అవసానదశలో కాశీవాసం చేస్తారు. శ్రీరామచంద్రుడంటివాడు రామేశ్వరంలో శివ లింగ ప్రతిష్ఠ చేసి, పూజలు చేసాడు. ఇలా అనేక శివలింగాల ప్రతిష్ఠను శ్రీరామ చంద్రుడే చేసినట్టు భారతదేశ ఆలయ చరిత్ర చెబుతున్నది. శివాలయమూ, రామాలయమూ లేని ఆంధ్ర గ్రామము లేదన్న ప్రామాణిక సత్యం. దక్షిణాదిన శివ పంచారామాలున్నట్లే, ఉత్తరాదిని కూడా పంచరామాలున్నాయ్.

త్రిలింగ ఆలయాలున్నందునే ఆంధ్రదేశానికి త్రిలింగదేశమూ, తెలుగుదేశమూ అని పేరు కల్గిందన్న విషయం ఎంతోమందికి విదితమే!

శివకేశ అబేధాన్ని ఆదిశంకర భగవత్పాదులు విశదీకరించారు.

శివరాత్రి ప్రతీ మాసమూ వస్తుంది. మహాశివరాత్రి మాఘమాసం బహుళ చతుర్ధశినాడే వస్తుంది. ఆరోజున రెండు త్రిదశ బిల్వ పత్రాలనైనా శివలింగంపై నుంచి ముక్తి మోక్షములు పొందండి శివరాత్రి మహాత్మ్యం తెలుసుకోండి.

సంగీత, సాహిత్య, నృత్యాలకు అధిదేవతాయనే! క్షీరసాగర మదనంలో అమృతానికి ముందు, వాసుకిగళం (విషం) బయటకు వచ్చినప్పుడు ఆయనే గరళాన్ని ఆస్వాదించి కంఠంలో నింపుకుని గరళకంఠుడయ్యాడు. దానితో ఆయన కంఠం నీలంగా మారిపోయింది. ఆ కారణంగా ఆయన్ను నీలకంఠుడన్నారు.

రాక్షసులు దుష్టులని తెలిసి, వారికి కోరిన వరాలిచ్చిన భోళాశంకరుడు. శంకరుడు అంటే శుభంకరుడు. అందుకే పెద్దలు శివానుగ్రహ ప్రాప్తిరస్తు అంటారు. ఆయన్ను స్మరిస్తే మృత్యువు కూడా పారిపోతుంది. అనారోగ్యంగా ఉన్నప్పుడు, మృత్యుంజయ మంత్రం జపిస్తూ, హోమం చేస్తే ఆరోగ్యం సిద్ధిస్తుంది.

శంకరుని పేర్లలో 'వ్యోమకేశు' అని కూడా ఉంది. 'వ్యోమ' అంటే ఆకాశమే, 'కేశః' అన తల జట్టుగా కలిగినవాడని అర్ధం. ఆకాశాన్ని శిరోజాలుగా కలిగి వుండడమేమిటట?

ఇలాంటి రహస్యాలతో నిండిన ఆ తల ఆకాశానికి సంకేతం! అంటే 'ఆకాశం ఓ రహస్యాల పుట్ట'. లెక్కకు మించిన (అసంఖ్యాకం) విషయాల్ని చెప్పాల్సొచ్చినప్పుడు తలజట్టుని చేత్తో స్పృశిస్తూ ఈ మాటలే అంటాం. శంకరుని తల అనేది ఆకాశం కాబట్టే, ఆకాశ గంగ అనేది ఆయన తలమీదే ఉంటుంది. ఆయన శిరసే ఆకాశం కాబట్టి, ఆకాశంలో ఉండే చంద్రుడు ఆయన తలమీదే కన్పిస్తూంటాడు. ఆయన నివాసం కూడా ఆకాశమంత ఎత్తున ఉండే కైలాసం. ఒక చేతిలో ఢమరుకం, మరో చేతిలో త్రిశూలం, కరుణాపూరిత హస్తం గల గరళకంఠుడాయన.

ఆయన పాపహరుడు

మాఘ బహుళ చతుర్ధశి మహాశివరాత్రి పరమ పవిత్రమైనది. ఆదిదేవుడు లింగరూపంగా అవతరించిన రోజని, పార్వతీ పరమేశ్వరుల వివాహ శుభదినమని ఈ పర్వదినానికి ప్రశస్తి. ఈ శివరాత్రి పర్వదినాన విభూతిధారణ చేసి జరిపే పూజలు, ఉపవాసం, జాగరణ వల్ల పాప విముక్తి కల్గుతుందని భక్తుల నమ్మిక. శివునికి ప్రీతిపాత్రమైన బిల్వదళాలతో శివలింగార్చన చేస్తారు. బిల్వపత్రాలు లక్ష్మి నివాస స్థలం. పూజా సమయలలో భక్తులు శివ మహిమ్న స్తోత్రం, శివతాండవ స్తోత్రం, ఓం నమశ్శివాయ అనే పంచాక్షరీ మంత్ర జపం చేయడం శుభం. సన్యాసాశ్రమ స్వీకారం చేసేవాళ్ళు ఈ మహాశివరాత్రి రోజే సన్యాసదీక్ష తీసుకుంటారు.

శంకరునికి ఇష్టమైనవి

పత్రాల్లో మారేడాకు, పుష్పాల్లో జిల్లేడాకు, మల్లి, తుమ్మిపూలు, పాలల్లో ఆవుపాలు, జలాల్లో గంగాజలం, జపమాలల్లో రుద్రాక్షలు లేదా స్ఫటికాలు, ఫలాల్లో కొబ్బరికాయ, శరీర లేపనాల్లో తెల్లని భస్మం, లోహాల్లో బంగారం, క్షేత్రాల్లో వారణాశి, మాసాల్లో కార్తీకం, పక్షాల్లో బహుళం, తిథుల్లో చతుర్ధశి, వారాల్లో సోమవారం, పర్వతాల్లో హిమాలయం, పండుగల్లో మహాశివరాత్రి, వృత్తుల్లో భిక్షాటనం ఆయనకి మహా ప్రీతికరమైనది. అందరికీ శివానుగ్రహం ఉండాలని నా ప్రార్థన. ●

పరమార్థ కథలు

శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాముల వారు

అశ్రద్ధ

ప్రముఖాంధ్ర ఈ 26 సంవత్సరాలుగా వస్తూందంటే నాన్నగారి నిరంతర కృషితో పాటు దేవుని అనుగ్రహం, గురువుల ఆశీర్వదచనమే కారణం. శుకబ్రహ్మాశ్రమ సంస్థాపకులు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామి వారి గీతామకరందాన్ని దరిదాపుగా 20 సంవత్సరములు ధారావాహికగా ప్రచురించాం. పత్రికకు అదో పెద్ద రక్షలా అనిపించింది. గీతామకరందం అయిన వెంటనే ప్రస్తుత పీఠాధిపతి శ్రీ విద్యాస్వరూపానంద స్వామి వారి దగ్గరకు వెళ్ళి మహాధారావాహికగా ప్రచురించటానికి ఒక మంచి పుస్తకాన్ని అడిగాను. వారు దయతో అంగీకరించి "పరమార్థ కథలు" పుస్తకాన్నిచ్చి నెలకో కథ వేసుకోమన్నారు. నాలుగైదు నెలలు వేసాను కూడా. ఎందుకో మధ్యలో బ్రేక్ పడింది. ఈ సంచిక నుండి మళ్లీ ప్రారంభించాను. ఈసారి అంతరాయము వుండదు. ఈ పేజీ స్వామివారు అనుగ్రహించింది. ఆశీర్వదించింది. మాకు పత్రికకు బలం.

– గోటేటి వెంకటేశ్వరరావు

ఒకానొక పట్టణములో ఒక శ్రీమంతుడు కలడు. అతడు ఒక సామాన్య కుటుంబము నందు జన్మించినను తన అనవరత పరిశ్రమ చేతను, వ్యాపారకళ యందలి నేర్పరితనము చేతను అపారధనమును సంపాదించి ఆ ప్రాంతంలోనే గొప్ప శ్రీమంతుడయ్యెను. ఆ పట్టణమునందలి దేవాలయములో ఒకనాడు రాత్రి ఒక భాగవతారు గారు ప్రహ్లాదోపాఖ్యానమును హరికథ రూపమున చెప్పుచుండిరి. శ్రోతలు వేలకు వేలుగా వచ్చి వళ్ళంతయు చెవులు చేసుకొని ఏకాగ్రచిత్తులై వినుచుండిరి. హరిదాసు గారు తమ గానకళానైపుణ్యమును ప్రదర్శించి శ్రోతలను ఉఱ్ఱూత లూగించుచుండిరి. ప్రజలు భక్తివరశులై తమ ఇళ్లు, వాకిళ్లు మఱచి తదేక దృష్టితో కథను ఆలకించుచుండిరి. హరిదాసుగారి ఖ్యాతిని గూర్చి ఇదివఱకే వినియున్నట్టు ఆ శ్రీమంతుడు అవకాశమును జారవిడువక, హరికథను వినుటకై ఆనాడు దేవాలయమునకు వెళ్లెను. ప్రహ్లాదోపాఖ్యమును గూర్చిన రసవత్తరమైన ఘట్టములను హరిదాసు భక్తి పారవశ్యమున ప్రబోధించుచుండ, వానిని చక్కగా ఆకళింపు చేసుకొనిన ధనికుని యొక్క హృదయములో ఒక గొప్ప పరిణామ ముదయించెను.

ఇదివఱకు భగవంతుని యెడల భక్తి ఏకొద్దిగానో గలవాడు ఇప్పుడు దానిని పెంచుకొని విశేషభక్తి కలవాడయ్యెను. ఇదివఱకు ప్రాపంచిక పదార్థముల యెడల అత్యాసక్తి కలవాడు, ఇప్పుడు వానియొక్క నశ్వరత్వమును గుర్తెఱింగి వానిపై మమత్వమును, అభిలాషను తగ్గించుకొనెను. ఇదివఱకు విషయభోగములే జీవునకు శరణ్యమని భావించినవాడు, తన యా సిద్ధాంతమును మార్చుచేసికొని భగవంతుడొకడే శాశ్వతుడనియు, అతడే సర్వావస్థలయందును సమస్త ప్రాణులకును అనుసరింపదగినవాడనియు నిశ్చయించుకొనెను. తత్ఫలితముగ అతడు తన గృహమున పూజాపునస్కారములను విరివిగా జరుపుచుండెను.

ఒకనాడా శ్రీమంతుడు పురోహితుని రప్పించి సత్యనారాయణ పూజ జరిపించుచుండెను. పురోహితుడు షోడశోపచారములతో సాంగోపాంగముగ పూజ నిర్వహించుటకు కృతనిశ్చయుడై సత్యనారాయణుని పటమును పుష్పమాలలతో కనులపండువగ అలంకరించి, పటమునకు ఎదురుగా శ్రీమంతుని కూర్చొనబెట్టి పూజకు ఉపక్రమించెను. పూజ చక్కగా కొనసాగుచుండెను. ఇంతలో ధూప ప్రకరణము రాగా పురోహితుడు "అయ్యా! దేవునకు ధూపము సమర్పించవలసి యున్నది. అగరొత్తులు తెచ్చి నారా?" అని ప్రశ్నించెను. ధనికునకు భక్తియున్నదే కాని శ్రద్ధలేదు. ఇంటి లోపల అగరొత్తులు ఉన్నప్పటికిని తెచ్చుటకు బద్ధకముచేత అతడు "పురోహితుడు గారు! అగరొత్తులు లేకుండానే పూజను కొనసాగించుడు" అని చెప్పెను. వెంటనే పురోహితుడు ఇక చేయునది లేక "ధూపార్థం అక్షతాన్ సమర్పయామి" ధూపము బదులు అక్షతలు వేయుచున్నాను అని చెప్పి పటముపై చల్లెను.

తదుపరి కొంతసేపటికి నైవేద్యఘట్ట మేతెంచెను. పురోహితుడు అయ్యా! దేవునకు నైవేద్యమేమైన చేసినారా? అని అడుగగా నేవైద్యము వంటశాలలో సిద్ధముగా నున్నప్పటికిని తెచ్చుటకు ప్రాలుమాలి "అయ్యగారూ! పురోహితుడిప్పుడు నైవేద్యార్థం అక్షతాన్ సమర్పయామి (నైవైద్యమునకు బదులు అక్షతలు వేయుచున్నాను) అని పురోహితుడు నైవేద్యం కోసరం కొన్ని అక్షతలను పటముపై చల్లెను. ఈప్రకారముగా పూజ కొనసాగగా ఆ దృశ్యము చూచి ధనికుని భార్య మనంబున గొప్ప ఆవేదనను బొంది భర్తతో ఏమండీ! భగవంతుడు మనకు అన్ని సౌకర్యములను కలుగజేసి ధనధాన్యములను సమృద్ధిగా ప్రసాదించి, ఏ లోటు లేకుండా అనుగ్రహించినాడు. వస్తువులన్నీ ఉండి కూడ ధూపదీప నైవేద్యాదులను ఆ దేవదేవునకు సమర్పించకుండా పూజ చేయుట సమంజసమేనా? అది ఉపచారమా? అపచారమా? దానివలన ఏమైనా ఫలితము కలుగునా? అని మందలించినను ఆపై వాక్యములను అతడేమియు సరకుగొనలేదు.

అప్పుడు ధనికుని అర్ధాంగి అతనికి సరియైన బోధను చేయదలంచి అవకాశము కొఱకు ఎదురుచూచుచుండగా, ఇంతలో మధ్యాహ్నపువేళ అతడు వంటశాలలోనికి భోజనము కొఱకు రాగా, భార్య అతనికి విస్తరివేసి అన్నము వడ్డించకుండా "అన్నార్థం అక్షతాన్ సమర్పయామి' (అన్నము బదులు అక్షతలు వడ్డించుచున్నాను) అని చెప్పి విస్తరి మధ్యలో అక్షతలు పెట్టి, ఆ తదుపరి "శాకార్థం అక్షతాన్ సమర్పయామి" (కూర బదులు అక్షతలు వడ్డించుచున్నాను) అని చెప్పి ఆ అన్నము ప్రక్కనే కొద్ది అక్షతలు పెట్టి ఈప్రకారముగా విస్తరి చుట్టూ అక్కడక్కడ అక్షతలు పెట్టుచుండగా భర్తకు వళ్లుమండి "ఏమే! అన్నము, కూరలు వడ్డించకుండ అక్షతలు వేయుచున్నావేమి' అని గద్దించి అడగగా భార్య అందులకు సమాధానముగా "ఏమండీ! దేవుని పూజకు ఏ ఉపచారమున్ను చేయక వట్టి అక్షతలతోనే పూర్తిచేసితిరిగదా! ఇప్పుడు మీ భోజనమునకు మాత్రము అన్ని ఉపచారములు చక్కగా ఉండవలెనా? అని ప్రశ్నింప ధనికుడు సిగ్గుతెచ్చుకొని, తన తప్పిదనమును గుర్తెఱింగి "ఇకమీదట పూజ మొదలైనవి సక్రమముగా చేసేదనని" హామీనొసంగెను. అంతట భార్య ధనికుని విస్తటిలోని అక్షతలు తీసివేసి అన్నము, కూర మొదలైనవి వడ్డించగా అతడు సుష్ఠుగా భుజించి లేచిపోయెను.

నీతి:– ఏ కార్యమైనను శ్రద్ధతో, విశ్వాసముతో చేసినప్పుడే అది సత్ఫలితమును, పూర్ణఫలితమును ఒసంగగలదు. అశ్రద్ధతో చేసినది దాదాపు చేయనిదానితో సమానమే కాగలదు. కాబట్టి ఏ కార్యమునకైనను శ్రద్ధను జోడించవలెను. ముముక్షువగువాడు అశ్రద్ధను పారద్రోలి, వినయ విధేయలతో, భక్తిశ్రద్ధలతో తన ఆధ్యాత్మిక కార్యక్రమములను నిర్వర్తించవలెను. ●

శ్రీ జగద్గురు భారతీతీర్థ మహాస్వామి చరణుల ఉపదేశము

ధ్యానము



మనసుపై నియంత్రణ లేనందున మానవుడు బాధపడ్తుంటాడు. ఆ నియంత్రణను ఎలా సంపాదించుకోవాలో తెలిస్తే అతనికి బాధలే ఉండవు. మనస్సును అదుపులో ఉంచుకునే సాధనను ధ్యానమంటారు.

"ధ్యానాభ్యాస వశీకృతేన మనసా" అని మనవాళ్ళు చెప్పారు.

యోగశాస్త్రం 'యోగ'కు ఎనిమిది అంగాలను చెప్పింది. అందులో ధ్యానం ఏడవది. అంతకుముందు చెప్పిన ఆరింటిలో యమనియమాలు మొదలైనవి ఉన్నాయి. వాటినికూడ సాధన చేయాలి. వాటినన్నింటినీ సాధన చేసేవారికి ధ్యానం తేలికగా అలవడుతుంది.

భగవద్గీతలోని ఆరవ అధ్యాయంలో శ్రీకృష్ణ భగవానుడు ధ్యానం గురించి వివరంగా చెప్పాడు.

ప్రశాన్తాత్మా విగతభీః బ్రహ్మచారివ్రతే స్థితః

ధ్యానాన్ని అభ్యాసం చేసేవారికి బ్రహ్మచర్యం అవసరం. ధ్యానాన్ని సాధన చేస్తూ మనస్సును అదుపులో పెట్టుకునేవారికి, మరోదానితో పోల్చలేనటువంటి అసాధారణ మానసికానందం లభిస్తుంది.

గురువు వద్ద వారి మార్గదర్శకత్వంలో ధ్యానాన్ని అభ్యసించాలి. పుస్తకాలను చూసి అభ్యసించడం వలన మంచి ఫలితాలు లభించవు. అందువలన గురువు వుండడం ముఖ్యం. ప్రశాంత వాతావరణాన్ని కూడా వెతుక్కోవాలి. అంటే తగిన ప్రదేశం కావాలి. మనస్సును కలవరపరచే పరిస్థితులుండరాదు. ధ్యానయోగంలో సిద్ధి పొందిన మహాత్ములలో ఆదిశంకరులను, సదాశివ బ్రహ్మేంద్రులను, చంద్రశేఖరభారతీ స్వాములను పేర్కొనవచ్చు. ధ్యానం యొక్క విశిష్టత అటువంటిది. గురువునుంచి సక్రమంగా నేర్చుకుని ప్రజలు ధ్యానాన్ని తమ నిత్యజీవితంలో అభ్యసించి శ్రేయస్సును పొందుదురుగాక!

అజ్ఞాన తిమిరాన్ధస్య జ్ఞానాంజన శలాకయా ।
చక్షురున్మీలితంయేన తస్మై శ్రీగురవే నమః

అజ్ఞానాంధకారంలో ఉన్న వ్యక్తికి జ్ఞానమనే కాంతిని దర్శింపజేసే గురువుకు నమస్సులు.

స్త్రీలను పూజించు స్వభావం కల శివాజీ

హైందవ సంస్కృతీ ఉత్కృష్టతను, శాస్త్ర సంపదను ప్రపంచ దేశాలు గ్రహించాయే కానీ, స్త్రీలను పూజించే సంస్కృతిని అలవర్చుకోలేదు. అలా స్త్రీకి ఉన్నతస్థానమిచ్చినది హైందవ ధర్మమే!

పదిహేడవ శతాబ్దానికి చెందిన ఛత్రపతి శివాజీ మహోన్నత మనస్సునూ, భక్తిప్రపత్తులనూ మెచ్చి, శ్రీశైలం లోని తల్లి భ్రమరాంబాదేవి దివ్యమైన ఖడ్గం ప్రసాదించినదని చరిత్రకారులు అంటారు. ముస్లిము నవాబుకు దోసెళ్లతో రుసుములు దోచిపెడ్తున్న రోజుల్లో, వీరాధివీరుడైన శివాజీ తన శౌర్యంతో హిందూ సామ్రాజ్య విస్తరణం చేశాడు. కళలకు సాంస్కృతిక కార్యకలాపాలకు వెన్నుదన్నై నిలిచాడు. శ్రీరామచంద్రునివోలె శరణు అన్న శత్రువులను క్షమించే క్షమాగుణం కలవాడు. స్త్రీల పట్ల పూజ్య భావం కలవాడు. పరస్త్రీలెల్లరినీ తల్లులుగా తలంచేవాడు.

మరాఠీ సైనికులు కల్యాణదుర్గం సుబేదార్‌ను ఓడించి, అతని ఖజానాను, అమూల్య వజ్రాలనూ, రత్నాలనూ తీసుకుని వస్తూ, అతని కుటుంబ సభ్యుల్ని బందీలుగా కొనితెచ్చారు. ఆనాటి అధికారులు తాము గెలిచి తెచ్చినవన్నీ రాజుకి సమర్పించడం ఆనవాయితీ.

బందీగా తెచ్చిన వారిలో సుబేదార్ కోడలు ఉన్నది. మహా అందాలరాశి. శివాజీ ఆమెనూ, ఆమె అంద చందాలను ఓ మాతృభావంతో చూస్తూ, నమస్కరించి, సేనాపతిని ఉద్దేశిస్తూ– సేనాపతీ, ఈ యువతిని పట్టితెచ్చి, నీవు మహాపాపం చేశావ్. ఓ అందమైన స్త్రీని బంధీగా తెస్తే ఆనందిస్తాననుకున్నావా? నేను యుద్ధం చేసి, తుష్కురులను ఓడించి, వారి రాజ్యాల్ను పాదాక్రాంతం చేసుకుంటాను, హైందవ ధర్మస్థాపనం చేస్తాను. ప్రజల్ను ధర్మబద్ధంగా పాలిస్తాను. రాజు రాజుతోనే పోరాడడం ధర్మం. అంతేకానీ, వారి కుటుంబ స్త్రీలతోగానీ, ప్రజలతో గానీ, వైరం ఉండదు. నాకు స్త్రీలంటే గౌరవం. తల్లితో సమానం. స్త్రీ శక్తి రూపిణి, దేవత. ఈమె కూడా నాకు దేవతయే.

ఈమెను తగిన గౌరవాదరములతో, సిబ్బందినిచ్చి, ఆమె ఇంటికి పంపించు. అంటూ ఆ స్త్రీ వైపు తిరిగి, అమ్మా నన్ను క్షమించు. నా సైన్యం నిన్ను బంధించి తీసుకుని వచ్చినందులకు చింతిల్లుతున్నాను' అని ఆమెకు క్షమాపణ చెప్పాడు.

ఆమె దించిన మోము పైకెత్తి 'మహారాజా! నీ కీర్తి ఎందుకింతగా భాసిల్లుతున్నదో దానిక్కారణం ఏమిటో ఇపుడు ప్రత్యక్షంగా చూశాను. ఇపుడు అర్థమైంది. నీ ధర్మం, నీవు స్త్రీల కిస్తున్న గౌరవం, మర్యాదలే నీ కీర్తిని చిరస్థాయి కలిగిస్తున్నాయ్. వెయ్యేళ్ళు వర్ధిల్లు మహరాజా– అంటూ ఆ స్త్రీ ప్రణమిల్లింది.

భారతదేశ పురాణాలు చరిత్రలను గానీ పరిశీలిస్తే, భారతీయులు స్త్రీల కెంతటి గౌరవస్థానం యిచ్చారో అవగాహనమవుతుంది. ఇప్పటి రాజకీయుల కేఁవి తెలుస్తుంది! విభజించి పాలించడం, రిజర్వేషన్లు అంటూ రెచ్చగొట్టడం తక్క, స్త్రీలను మాతృమూర్తిగా గౌరవించే విధానమే ఎరుగరు. ●

ప్రబంధ నాయికలు

ప్రసిద్ధ పురాణాలలోని చిన్న కథను తీసుకుని, దానిని నవరసాలతో, అష్టాదశ వర్ణనలతో పెంచి పెద్దది చేయడం ప్రబంధం. 16వ శతాబ్దంలో ఈ ప్రబంధం ప్రసిద్ధి పొందింది. శ్రీకృష్ణదేవరాయలు ప్రబంధ కవులకు తన ఆస్థానంలో స్థానం కల్పించాడు.

ఆ ప్రబంధ కవులు ప్రబంధ నాయికలను అద్భుతంగా చిత్రీకరించారు. అటువంటి కొంతమంది ప్రబంధ నాయికలను మీముందు ఉంచుతున్నాను.

వరూధిని :

ఒక గంధర్వకాంత. ఒక గంధర్వుడు ప్రేమించినా త్రోసిపుచ్చింది. కానీ ప్రవరాఖ్యుడనే బ్రాహ్మణుడు హిమాలయాల అందాన్ని చూస్తూ, దారితప్పి తిరుగుతున్న అతని సౌందర్యానికి మురిసి మోహించింది. తన కుటీరం ముందు తాంబూలం వేసుకుని, వీణ వాయిస్తూ కూర్చుంది. ఆ తాంబూలపు వాసనకు, అక్కడ మనుష్య సంచారం ఉందని ప్రవరాఖ్యుడు అక్కడకు వచ్చాడు. తన ఊరికి దారి చూపించమని అడిగాడు. ఇంతింత పెద్ద కన్నులున్నాయి, దారి కనిపించడంలేదా అంది. తాను అతనిని వలచిందని, చివరకు అతనిపై పడింది. కానీ ప్రవరాఖ్యుడు ఆమెను త్రోసివేసి, వెళ్ళిపోయాడు.

ఇదంతా గంధర్వుడు గమనించాడు. ప్రవరాఖ్యుని రూపంతో కొలనులో స్నానం చేస్తూ నిలబడ్డాడు. అతనిని చూసి ప్రవరాఖ్యుడే అని భావించింది. అతనితో సంభోగించడానికి పూనుకుంది. కానీ మాయా ప్రవరాఖ్యుడు తన నిజరూపం తెలియకుండా ఆ సమయంలో కన్నులు మూసుకోమన్నాడు. వరూధిని గర్భవతి అయ్యింది. ఆమెకు స్వరోచి జన్మించాడు.

అల్లసాని పెద్దన రచించిన 'మనుచరిత్ర'లోని వరూధిని ప్రధాన నాయిక. ఆమె తాను వలచినవాడి కోసం మోసపోయింది. కానీ ఆమె ప్రవరాఖ్యుని మాత్రమే వలచింది.

గిరిక :

ప్రబంధ సాహిత్యం మొట్టమొదటిగా ప్రకృతికి మానవత్వాన్ని ఆపాదించింది. శంక్తిమతి నదికి కోలాహల పర్వతానికి పుట్టింది గిరిక. ఆ నదికి అడ్డంగా వున్న కోలాహల పర్వతాన్ని ఉపరిచర వసువు త్రోసాడు. కాబట్టి శంక్తిమతి గిరికను భార్యగా ఇచ్చింది. ఋతుమతియైన గిరికకు మాంసం పెట్టమని పితృదేవతలు అన్నారు. అది తేవడానికి వసువు అడవికి వెళ్ళాడు. ఆమె సౌందర్యాన్ని తలచుకోవడంతో వసువుకు రేతఃపతనం అయ్యింది. దానిని గిరికకు ఇమ్మని ఒక ఆకులో పెట్టి, డేగతో పంపాడు. కానీ అది చేప నోటిలో పడింది.

రామరాజభూషణుడు రచించిన 'వసుచరిత్ర'లోని నాయిక గిరిక. గిరిక ప్రకృతికి ప్రతీక. ఈ ప్రబంధం ప్రకృతికి మానవత్వాన్ని ఆపాదించి, ఒక కొత్త ఒరవడి తీర్చిదిద్దింది.

సత్యభామ :

సత్రాజిత్తు కుమార్తె సత్యభామ. శ్యమంతకమణిని సత్రాజిత్తు శ్రీకృష్ణునకిచ్చి, తన కుమార్తెను కూడా ఇచ్చి వివాహం చేసాడు. శ్రీకృష్ణునికి సత్యభామ అంటే ఎంతో ప్రేమ. సత్యభామ సౌందర్యవతి, యుద్ధనిపుణురాలు. దానివలన ఆమెకు గర్వం కూడా ఎక్కువే. ఆ గర్వభంగాన్ని నారదుడు చేసాడు.

ఒకరోజు శ్రీకృష్ణుడు రుక్మిణి ఇంటిలో ఉన్నాడు. నారదుడు పారిజాత పుష్పాన్ని శ్రీకృష్ణునకిచ్చి, రుక్మిణికిమ్మన్నాడు. రుక్మిణి దానిని కొప్పులో ధరించింది. నారదుడు ఆమె సౌందర్యాన్ని పొగుడుతూ, సవతులంతా ఆమెకు దాస్యం చేస్తారన్నాడు. ఈ మాటలన్నీ సత్యభామ చెలికత్తె సత్యభామకు చెప్పింది. సత్యభామ కోప గృహానికి వెళ్ళింది. శ్రీకృష్ణుడు ఆమె అలుక తీర్చాలని ప్రయత్నం చేసాడు. కానీ సత్యభామ శ్రీకృష్ణుని శిరస్సును తొలగద్రోసింది. దానికి బాధపడకుండా శ్రీకృష్ణుడు ఆమె కాలు నొచ్చిందేమోనని బాధపడ్డాడు. చివరకు పారిజాత వృక్షాన్నీ సత్యభామ ఉద్యానవనంలో నటించాడు.

ఈ 'పారిజాతాపహరణం' నంది తిమ్మన్న రచించాడు. ఈ కవి రాణి తిరుమలాంబతోపాటు వచ్చినవాడు. శ్రీకృష్ణదేవరాయలకు, రాణికి మధ్య వచ్చిన విభేదాలు రూపుమాపడానికి రాసాడని అంటారు.

ఏదైతేనేమి సత్యభామ ప్రబంధ నాయిక అయ్యింది. సౌందర్యంతోపాటు యుద్ధనైపుణ్యాన్ని సాధించి, తన గొప్పతనాన్ని చాటుకుంది.

ప్రభావతి :

వజ్రనాభుడనే రాక్షసుని కుమార్తె ప్రభావతి. ఆమె చెలికత్తె రాగవల్లరి. ఇంద్రుడు పంపడంవల్ల శుచిముఖి అనే హంస ఆమె ఉద్యానవనంలో ప్రవేశించింది. ఆమె ఎదురుగా ప్రద్యుమ్నుని సౌందర్యాన్ని పొగిడి, ఆమెలో వలపు పుట్టించింది. ప్రభావతి అతనిని ఎలాగైనా తనదగ్గరకు తీసుకురమ్మని హంసను వేడుకుంది. శుచిముఖి ప్రద్యుమ్నుని నటుని రూపంలో తీసుకువచ్చింది. ప్రద్యుమ్నుడు నాట్యం చేస్తూ, తుమ్మెదై ప్రభావతి కోసం పంపబడే పూలలో దూరి అంతఃపురానికి వెళ్ళాడు. అక్కడే రహస్యంగా ప్రభావతీ ప్రద్యుమ్నులు వివాహం చేసుకున్నారు. వారికి ప్రభావంతుడనీ కుమారుడు పుట్టాడు.

ఈ కథను పింగళి సూరన 'ప్రభావతీ ప్రద్యుమ్నుడు' అనే ప్రబంధంగా రచించాడు. అందులో ప్రభావతి ప్రబంధ నాయికగా, సౌందర్యవతిగా చిత్రితమైంది.

ప్రబంధాలలో నాయికలు సౌందర్యవంతులుగా చిత్రించబడ్డారు. దానితోపాటు తమ వ్యక్తిత్వాన్ని కాపాడుకున్నారు. అలాగే తమ నైపుణ్యాలనూ ప్రదర్శిస్తూ, తాము ఎందులోనూ తీసిపోమని నిరూపించారు.

– **డా॥ పి. శర్వాణి,** ఎమ్.ఏ., పి.హెచ్.డి.

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

Lovely Stay at Holy Tirupathi The Gateway of Lord Balaji

HOTEL MAYURA

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :

త్యాగరాజ ఆరాధనోత్సవాలు

త్యాగరాజ ఆరాధన ప్రముఖ వాగ్గేయకారుడు త్యాగ రాజును స్మరించుకుంటూ సంవత్సరానికి ఒకసారి జరిగే సంగీతోత్సవాలు. ఈ ఉత్సవాలకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కర్ణాటక సంగీత విద్వాంసులు త్యాగయ్యకు తమ నివాళులు అర్పించడానికి విచ్చేస్తారు.

ఈ ఉత్సవం త్యాగరాజు కావేరీ నది ఒడ్డున సమాధి సమీపంలో పుష్య బహుళ పంచమి నాడు జరుగుతుంది. ఈ రోజు సంగీత విద్వాంసులంతా ఆయన సమాధి చుట్టూ కూర్చుని ఆయన స్వరపరిచిన పంచరత్న కీర్తనలను బృంద గానంగా ఆలపిస్తారు. సంగీతాన్ని ఆలపించే విద్వాంసులే కాక భారతీయ శాస్త్రీయ సంగీతాభిమానులు ఆ సంగీతాన్ని వినడానికి అక్కడికి వస్తారు.

చరిత్ర

ఈ ఆరాధన ప్రతి సంవత్సరం త్యాగరాజ స్వామి పరమపదించిన రోజైన పుష్య బహుళ పంచమి రోజున శ్రీ త్యాగబ్రహ్మ మహోత్సవ సభ ఆధ్వర్యంలో జరుగుతుంది. తమిళనాడులోని, తంజావూరు జిల్లా, తిరువయ్యూరులోని త్యాగరాజు సమాధి ప్రాంగణంలో ఈ ఉత్సవం జరుగు తుంది.

ప్రస్తుతం జరుగుతున్న ఆరాధనా సంప్రదాయానికి వంద సంవత్సరాలకన్నా ఎక్కువ వయసే ఉంటుంది. త్యాగరాజు 1847లో మరణించాడు. మరణానికి కొద్ది రోజుల ముందుగా ఆయన సాంప్రదాయ బద్ధంగా అన్నీ త్యజించి సన్యాసిగా మారాడు. ఆయన మరణించిన తరువాత భౌతిక కాయాన్ని కావేరీ నది ఒడ్డున ఖననం చేసి అక్కడే ఒక స్మారక చిహ్నాన్ని నిర్మించారు. ఆయన శిష్యులంతా వారి వారి స్వస్థలాలకు చేరుకుని ప్రతి సంవత్సరం ఆయన వర్ధంతిని వారి ఇళ్ళలోనే జరుపుకునే వారు.

1903 సంవత్సరం వచ్చేసరికి ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆయన స్మారక నిర్మాణం పాడుపడిపోయే స్థితికి వచ్చింది. అప్పుడే, ఆయన దగ్గర విద్యనభ్యసించిన ఇద్దరు విద్యార్థులు దాన్ని సందర్శించడం జరిగింది. వారే ప్రముఖ సంగీత విద్వాం సులు ఉమయాల్పురం కృష్ణ భాగవతార్, సుందర భాగవతార్లు. వారు తమ గురువు సమాధికి అలాంటి పరిస్థితి కలగడం చూసి చలించిపోయారు. అప్పటికప్పుడే ఆ ప్రాంతాన్ని పునరుద్ధరణకు ఏర్పాట్లు చేశారు. ప్రతిసంవత్సరం ఆయన వర్ధంతిని అక్కడే జరపడానికి నిశ్చయించారు.

మరుసటి సంవత్సరం నుంచి సంగీత ప్రపంచంలోని ఉద్ధండులంతా ఆయన వర్ధంతి రోజు తిరువయ్యూరులోనే జరపాలనీ, వారందరూ కలుసుకుని తమ అభి ప్రాయాలను పంచుకోవడానికి వేదికగా ఎంచుకోవాలనుకున్నారు. 1905లో ఈ ఉత్సవాలు పేదవాళ్ళకి పెద్దఎత్తున అన్నదానం, వేద సంప్రదాయాల ప్రకారం పూజలు ఘనంగా జరిగాయి.

కృష్ణ భాగవతార్, సుందర భాగవతార్ ఈ ఉత్సవాలకు ప్రేరణగా నిలిస్తే, తిలైస్థానం నరసింహ భాగవతార్ , తిలైస్థానం పంజు భాగవతార్లు నిర్వాహకులుగా ఆర్థిక సహాయకులుగా ఉన్నారు. అయితే మరుసటి సంవత్సరానికి ఆ ఇద్దరూ అన్నదమ్ముల మధ్య అభిప్రాయ భేదాలు వచ్చి ఇద్దరూ సమాంతరంగా ఉత్సవాలు జరపడం ప్రారంభించారు. మిగతా వారు కూడా చెరో పక్క చేరి రెండు వైరి వర్గా లుగా విడిపోయారు. పెద్దవాడైన నరసింహ భాగవతార్ నిర్వహించే ఆరాధన పెరియ కచ్చి (పెద్ద బృందం) చిన్నవాడైన పంజు భాగవతార్ నిర్వహించే ఆరాధన చిన్న కచ్చి (చిన్న బృందం) గా పేరు పెట్టుకున్నారు. వారిద్దరి మరణానంతరం పెరియ కచ్చి ప్రముఖ వాయులీన విద్వాంసుడు మలైకోట్టై గోవిందసామి పిళ్ళై ఆధీనంలోకి, చిన్న కచ్చి ప్రముఖ హరికథా కళాకారుడు శూలమంగళం వైద్యనాథ భాగవతార్ ఆధీనంలోకి వచ్చింది. నెమ్మదిగా చిన్న కచ్చి ఆరాధనకు ఐదు రోజుల ముందు ప్రారంభమై, ఆరాధన రోజున ముగిసే లాగా, పెద్ద కచ్చి ఆరాధనరోజు ప్రారంభమై తరువాత నాలుగు రోజులపాటు సాగే సాంప్రదాయం మొద లైంది. రెండు వర్గాలు సంగీత ప్రదర్శనలు ఏర్పాటు చేసే వారు. పేదలకు అన్నదానం చేసేవారు. ఆ తొమ్మిది రోజులు సాధారణ ప్రజలకు మంచి వేడుకగా ఉండేది కొద్ది రోజులకు రెండు వర్గాలకు మధ్య సయోధ్య కుదిరింది. అప్పట్లో ఆడవాళ్ళను సంగీత ప్రదర్శన చేయనిచ్చేవారు కాదు. దేవదాసీలు తప్ప సాధారణ గృహస్థులెవరూ బహి రంగంగా పాడటానికి, నృత్యం చేయడానికి ఒప్పుకునేవారు కాదు. రెండు వర్గాలు నాదస్వరాన్ని కూడా ప్రదర్శనలలోకి అనుమతించేవారు కాదు.

అప్పట్లో బెంగుళూరు నాగరత్నమ్మ అలాంటి దేవ దాసీగా ఉండేది. అప్పటి విద్వాంసులలో ఆమెకు ప్రముఖ స్థానం ఉండేది. త్యాగరాజుకు, సంగీతానికి వీరాభిమాని అయిన ఆమె అప్పట్లో మద్రాసులో నివసించేది. ఆమె ప్రదర్శనల్లో చాలావరకు ఆయన కృతులను ఆలపించేది. ఆయన అనుగ్రహం వల్లనే తనకు మంచి సంపద సమకూరిందని భావించేది. 1921లో, ఆమెకు వయసు మీరింది. పిల్లలు కూడా లేరు. ఆమె తన యావదాస్తినీ త్యాగ రాజు యొక్క వారసత్వాన్ని తర్వాతి తరాలకు అందేలా చేయడానికి ఆయన స్మృతులను భద్రపరచడానికి రాసిచ్చేసింది. 1925 లో ఆయన స్మారకానికి ఆలయ నిర్మాణం ప్రారంభించింది. కొంతమంది ఆమె ఆలయాన్ని నిర్మించడానికి వీలుగా సమాధి ఉన్న స్థలాన్ని కొన్నదనీ, మరికొంతమంది ఆ స్థలం గ్రామ పంచాయితీకి సంబంధించినదనీ, ఆమె నిర్మాణం నిబంధనలకు విరుద్ధమైనదనీ, కానీ ఆమె ఉద్దేశం మంచిదవడంతో గ్రామపెద్దలు అందుకు అడ్డు చెప్పలేదనీ భావించారు. ఆ సమాధి దగ్గరే త్యాగరాజు విగ్రహాన్ని ప్రతిష్ఠింప జేసింది. 1926 మొదట్లో ఆ ఆలయానికి కుంభాభిషేకం జరిగింది. రెండు వైరి వర్గాలు ఈ నిర్మాణంలో జోక్యం కలుగజేసుకోలేదు కానీ నాగరత్నమ్మను అక్కడ ప్రదర్శన ఇవ్వడానికి, కనీసం హరికథ చెప్పడానికి ఒప్పుకోలేదు. త్యాగరాజు తన పాటలలో అక్కడక్కడా మహిళపై చేసిన ఆరోపణలను అందుకు కారణంగా చూపించారు.

కానీ నాగరత్నమ్మ వాటన్నింటికీ బెదరక మూడో వర్గాన్ని ప్రారంభించి ఆ ఆలయం వెనుకలే ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించింది. ఇక్కడ చాలామంది మహిళా సంగీత విద్వాంసులు ఆలపించేవారు. దాంతో మిగతా వర్గాల పాపులారిటీ కొంచెం తగ్గింది. ఆమె అంతటితో ఆగకుండా ఆ రెండు వర్గాలను ఆలయంలోకి నిషేధించాలనీ ఆమె నిర్మించింది కాబట్టి ఆ హక్కు తనకే ఉండాలని కోర్టుకు ఎక్కింది. ఆమె కేసు ఓడిపోయింది. కానీ కోర్టు మూడు వర్గాలు ఆరాధనను మూడు సమాన భాగాలుగా విభజించుకుని నిర్వహించుకోమని తెలిపింది.

ఈ సాంప్రదాయం 1940 వరకు అలాగే కొనసాగింది. 1941 యస్.వై కృష్ణస్వామి అన్ని వర్గాలవారిని ఏకం చేశాడు. అప్పటి నుంచి ప్రస్తుతం జరుగుతున్న ఆరాధన సంప్రదాయం మొదలైంది. హరికేశనల్లూరు ముత్తయ్య భాగవతార్ పంచరత్నకీర్తనలను బృంద గానానికి బాగా సరిపోతాయని వాటిని ఎన్నుకున్నాడు. అప్పటి నుంచి అందరూ కలిసి పంచరత్నకీర్తనలను ఆలపించడం సాంప్రదాయంగా మారింది. 1941 కు మందు మూడు వేర్వేరు ప్రదర్శనలు జరపడం వల్ల ఎవరికిష్టం వచ్చిన కీర్తనలు వారు పాడుకునేవారు.

నాగరత్నమ్మ తన మిగతా రోజులు కూడా తిరువయ్యూరు లోనే గడపాలనీ, తన సంపదనంతా త్యాగరాజు స్వామి సేవకే అంకితం చేసింది. అంతే కాకుండా మహిళలు కూడా ఆరాధనల్లో పాల్గొనేందుకు ఎటువంటి అడ్డంకులు లేకుండా చేసింది. 1952 లో ఆమె చనిపోయినపుడు ఆమెను త్యాగరాజు సమాధికి సమీపం లోనే ఖననం చేసి ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆ విగ్రహం త్యాగరాజు సమాధిని చూస్తూ ఉన్నట్లు ఉంటుంది. ప్రస్తుతం తిరువయ్యూరులో ఏటేటా పెరుగుతున్న ప్రేక్షకులకు అనుగుణంగా అతి పెద్ద మండపం నిర్మాణంలో ఉంది.

– సేకరణ

చేతనావర్త కవిత్వమంటూ తెలుగు కవులు అంతరాత్మను తట్టి లేపుతూ మార్గదర్శనం చేసారు

చేతనా కవిత్వాన్ని ఒక రకమైన అభ్యుదయ కవిత్వంగా చెప్పుకోవచ్చు. అభ్యుదయ కవిత్వం 'నాటు పుగాకు'లా కనీ-పించని ఘాటుగా ఉంటుంది. ప్రాచీన పోకడలకు సవతియనే కొందరంటారు. దీనికి సోదాహరణంగా చెప్పాల్సి వచ్చినప్పుడు 'నాందీ' పలికిన కవి కోవెల సంపత్కుమార ఆచార్య. అయితే ఈ చేతనావర్త కవత్వాన్ని నలుగురు కవులు తెలంగానంలోని వరంగల్‌ను కేంద్రంగా చేసుకుని 'చేతనావర్తం' అనే వచన సంకలనాన్ని తీసుకుని వచ్చారు. వారు కోవేల సంపత్కుమారాచార్య, నరసింహారెడ్డి, పేర్వారం జగన్నాధం, కోవెల సుప్రసన్నాచార్యులుగా చెప్పుకోనగును. కోవెల సంపత్కుమార ఆచార్యులు వారు గళం విప్పిన భావాన్ని కల ముందు గ్రుచ్చి

అందుకే కాలం వలె అనంతమైన
సర్వదా ఏనాడూ సఫలం కాని,
వసుధైక కుటుంబ సంయోజనకు
సగర్వంగా పాటుపడుతున్నా
సిద్ధాంత ప్రమేయాల కూడదీసి
అనుక్షణం ఆగకుండా అరుస్తున్నా

ఆయనలో ప్రబోధిస్తున్నా - అంటారు.

ఆ మాటల్లో అంతర్ముఖంగా ఎంతగా, హాయిగా ఆత్మచైతన్యం దాగి ఉందో విశదపరచడానికి ఒక్క పుట చాలదు. ఒక్క ఆరు పంక్తుల సంపుటిలోనే - 'వ్యక్తికీ, వ్యవస్థకూ మధ్య అవినాభావం, ఆధారాధేయ భావం, ఆత్మవేదనా భావం ఉన్నదో బుద్ధిగమ్యమగు కవిత్వం ఆత్మావలోకనం చేస్తూన్నది. మానవుడు తన మేధతో ఉపార్జించిన జ్ఞానబలంతో ఆత్మానురాగ వర్తనుడై తన ఉనికిని గుర్తించి, సాటి మానవునికి తోడ్పడవలెననీ, కలిసియుండవలెననీ తేలిక మాటలతో ఘాటుగా చెప్పారు.

రెండవ కవి నరసింహారెడ్డి గారు - సమాజంలోని లొసుగుల్ని, వాడి వేడి ఘాటు పదజాలంతో ఉద్వేగ పాలు ఎక్కువగా కనపడినా, వ్యంగ్యాన్ని కూరలో ఉప్పు వేసినట్లుగ!

ఇక్కడంతా కామం
నాయకులు నానా గడ్డి కరుస్తున్నారు
పశువులు మేత లేక చస్తున్నవి.

- అంటూ ఆ ఘాటుగాట్లలో తిట్లను కూరి -

'ఒరేయ్! కోరికల ఊరేగింపులకు బెదరి
గుండె చెదరి, ఉరేసుకుంటున్న బ్రూట్ -
నువ్వంటే రోత!! అంటూ ఆక్రోశించారు.

- ఉరేసుకుంటున్నవాణ్ణి అలా తిడితే ఏమనుకుంటాడన్న ధ్యాసే లేదు. ఆ ఊసును అతడు చేస్తున్నది సరియైనది కాదని సున్నితంగా చెప్పవచ్చు. ఆయన ఆవేశ ధోరణియని వారి పెదాల్నుంచి వచ్చిన పదాలే చెబుతున్నాయ్.

మూడో కవి పేర్వారం జగన్నాధం గారి కలం ఫౌంటన్‌లోని నీరులా చమత్కారం ఎగసిపడుతుందనడానికి ఉదాహరణయే ఈ ఛమక్ కవిత:

"స్వామీ! ఈ మగడు నాకొద్దు-
వీడసలే తుమ్మమొద్దు!
వీడా సత్యవంతుడు కాడు.
నేను సావిత్రిగా నటించలేను!

కోవేల సంపత్కుమారాచార్య

- అంటుంది ఏంవిటో ఓపలేనట్టు.

పేర్వారం వారి భావాలన్నీ మనిషిలో నిగూఢంగా ఉన్న మనోభావాల్ని, బావిలోనున్న నీరును చే(త)దతో తోడి పొయ్యడమే! దాని వలెనే అతడు చైతన్యుడు కాగలడని ఆయన విశ్వాసం. మరోచోట:

'మానవతను మట్టిలో పారేసి
మంచితనాన్ని మీరు భూమిలో పాతేసి
అభ్యుదయం తెస్తామనడం
ఆకసాన్ని కోస్తామనడం
ప్రజావంచనకు మెత్తని మార్గం'

- ఇప్పుడు నాయకమణులు పాదయాత్రలో పాత చెంబును చింతపండుతో తోమి తళతళలాడే చెంబు కాన్తిలో మాటలతో పబ్బం గడుపుకునే లక్ష్యమిదే. ఆయన వేదం నుంచీ ఆధునిక వాదం వరకూ బాగా నెరింగిన వుత్పన్నుడు, విమర్శకుడు, సంప్రదాయ మెఱింగినవాడు. బాగా పండిన పాండిత్యం ఆయన్ను నోరూరిస్తూ, నోరూరింపచేస్తుందనడమేంవీ అత్యుక్తి కాదు.

పేర్వారం జగన్నాధం

నాలుగవ కవి కోవెల ప్రసన్న కుమార కవిత్వంలో మానవతా వికాసం కోసం శాంతి కోసం, విశ్వ మానవ ప్రేమ కోసం, నిరంతరాన్వేషణం కనిపిస్తుంది. ఆయన తన కలాన్నెప్పుడూ పదును పెడుతూనే ఉంటారు:

"త్యాగంలో సౌందర్యం చూపించు
మాకొక చరిత్ర నిర్మించు
అంతరాత్మకూ ఆలోచనకూ మధ్య
ఆవరణ కుధ్యాన్ని ఛేదించు
మమ్ము మాకు చూపించు
మాకొక చరిత్ర నిర్మించు - తల్లీ!

ఈ నేల ప్రతీచోటా చైతన్య స్పందనం కల్పించు.

- ఇలా ఆయన యొక్క రసరమ్య కవిత ఆరాధ్య భావంతో శాంతి దేవతను ప్రార్థిస్తూ నడక సాగిస్తుంది. ఆయన గతానికీ వర్తమానానికీ వారధి కట్టడానికి ప్రయత్నించారు.

ఈ చేతనావర్త సాహిత్యంలో పాతను త్రోసి రాజన లేదు. వర్తమాన లొసుగుల్ని హితైషిగా చెప్పడం, ఉన్నత విలువలకు ఉత్తమ కవిత్వం ప్రేరణ యిస్తుందనే నమ్మకంతో ఇరువైపులా పుష్ప వృక్షాలుండే నందనవన బాటలో తెలుగు సాహిత్యం అందరి మస్తకములలోనూ పారిజాత పరిమళాలను వెదజల్లుతూ కుళ్ళును కుళ్ళు కాలువలకు తొలి వేస్తూ, ప్రశాంతత సాంతమూ సాంద్రతతో కూడిన సుమనస్కుల సమాజాన్ని సృజిస్తూ, శాంతిని విరబూయించాలని ప్రయత్నించిన ఈ నలుగురు చేతనావర్త కవులకు అంజలులు ఘటిస్తున్నాం.●

Hotel Southern - New Delhi

Hotel Southern at New Delhi - Is the Largest South Indian Hotel, equipped with 110 rooms with modern amenities, conference hall, with a Vijayawada Restaurant located in the premises, serving the best South Indian Food and Delicacies.
The Hotel is centrally located 2.5 kms from New Delhi Railway Station and 15 kms from Domestic / International Airport.

Southern Grand - Vijayawada

Hotel Southern Grand at Vijayawada - It is a recently opened hotel with 3 star kind of modern amenities and equipped with a total of 37 rooms, conference hall and a Restaurant located in the premises, serving the best South Indian Food and Delicacies.
The Hotel is centrally located 0.5 km from Vijayawada Railway Station and 19 kms from Domestic Airport.

Complimentary : **Breakfast & Transport from Rly. Station / Airport to our Hotel, subject to prior information to our offices**
■ Bring Your Boarding Pass of Air India Airlines & Avail 10% discount on Room Tariff only

HOTEL SOUTHERN ™
style. comfort. enjoy.

18/2, Arya Samaj Road,
Karol Bagh, **New Delhi.**
Tel.: 4353 2824, 2875 4210,
Fax: 011-2875 7308
e-mail: info@hotelsouthern.com
Reservations: Call 011- 4145 0200

26-6-8, Papaiah Street, Opp. Registrar's Office
Gandhi Nagar, **Vijayawada,** Andhra Pradesh
Tel.: 66 77 777, 66 55 777,
Fax: 0866-257 2227
e-mail: bza@hotelsouthern.com

Theater Style Upto 100 Persons

వాగ్గేయకారులే తెలుగు భాషను భక్తితో రంగరించి భాషా సౌరభంలో బంగారం పండేట్టు చేసారు!!

సంతోషాగర్ల శ్రీమంతులను చేసే సంగీతం వినా ఏమున్నదే మనసా? -నా(ర)దయోగీ త్యాగరాజా యోగీరాజా వాగ్గేయరా ధారా జాధిరాజులన్ మించి తెలుగు వెలుగుకెవరు సేవలొనర్వారే మనసా!!

సామవేదపర సంగీత సౌరముతో తెలుగు భాషను తరతరాలకూ తరగని వెలుగై ఉండునట్లు తెలుగు వాగ్గేయకారులే తెలుగు భాషా సొగసులు పండించడంతో భక్తి, జ్ఞాన, విజ్ఞాన, షోడష కళలను వరసింపచేసారు. తరులు, గిరులు, నదులు, నదములు, సాగరములు, అంబరమున సూర్యచంద్రులు, నక్షత్రములు, పృథివిని పచ్చదనం వర్ధిల్లుటకు వాగ్గేయకారుల సాధన ఫలం సంగీత, నృత్య, లలితకళల్లో 'మోక్ష' సామ్రాజ్యమందు తెలుగు వెలుగులనీనుతూ ప్రతీ రాత్రీ పున్నమి రాత్రిగా ప్రభవింపచేసారు. వారిని స్మరణ చేసుకోకుంటే మనం ధూర్తులమవుతాం.

నాదాధీనం జగత్ సర్వమ్-అను సామవేదం వాక్కును దివ్యవాక్కుగా గ్రహించినవారు తెలుగువారు. బ్రహ్మసామవేద గానాసక్తుడు. శంకరుడు నృత్యనాదప్రియుడు. మతంగ, భరత, శుక, శౌనక, నారద, తుంబర, హనుమంతాదులు, ఋషులు నాద బ్రహ్మోపాసనా మార్గంలోనే భక్తినీ, ముక్తినీ, మోక్ష సామ్రాజ్యాన్ని పొందారు. విహికా ముష్కికాలెన చతుర్విద పురుషార్థములు, భగవత్సాక్షాత్కారం 'సరిగమపదని' సప్తస్వర పునాబిలపై తెలుగు వాగ్గేయకారులు సంగీతహర్మ్యం నిర్మించి హర్షవర్షాన్ని కురిపించారు. భక్తితత్వం ద్వారా పరమేశ్వరుని సుస్వర భక్తివిలాస సంగీతంతో తెలుగు అక్షరాన్ని అజరామరం చేసారు.

జగదానందకారకుడు పరమేశ్వరుడు. ఆయనకు ఆనందం కల్గినప్పుడే నాద మధురత్వాన్ని అలంబనగా చేసుకుని తాండవ నృత్యం చేయడం- శబ్దంలోని స్వరలయ మాధుర్యం గంగారుుులిగా జ్వలించి, సకల చరాచర ప్రకృతినే పులకింపచేయడం. ఆ పద సారు -

జటాఝుటగల జ్జల ప్రవాహ పావిత స్థలే
గలేవల్యంబ్యలంబితాం భుజంగతుంగపాలికామ్
డమడ్డడ్డమడ్డాయన్నినాద వడయర్వయమ్
చకార చండతాండవం తనోతు నశ్శివశ్శివమ్
దగద్ధగద్ధగ జ్జ్వలల్లలాటపట్టపావకే
ధరాధరేంద్ర నందినీ విలాసబంధ బంధు
స్ఫురద్ధగంత సంతతి ప్రమోద మానమానసే-

ఇలా సాగే ధ్వనిద్ధగలతో సాగెడు శివతాండవం ప్రకృతిలోని పశుపక్ష్యాదులను సహితమూ పరవశింపచేసినందువల్లనే జగదానంద కారకా అంటూ నాదనృత్యాది అధిదేవతయైన పరమేశ్వరునికి తొలి తొలకరిలా చిలకరింపడానికి ముందే యోగీసత్తముడైన సిద్ధేంద్రుడు శివుని నటనా నాదసాంపు కాద్యుడయ్యాడు. కూచిపూడి నృత్యానికి బీజాలు నాటిన యోగపుంగవుడు. నర్తనం చేసి పదరవళుల ప్రసిద్ధితమ నాట్యంలో చూపారు. విశేషం ఏమంటే మగవారితోనే స్త్రీ పాత్రలను ధరింపచేసి స్త్రీలు ఇలా చేయగలరా- అనే నమ్మకంతో భామాకలాపాన్ని శృంగార రస సిద్ధిని అనుభవింపచేసిన తొలి నృత్యగురువూ ఆయనే! ఆద్యుడూ ఆయనే!

సిద్ధేంద్రుడు (1302-1390)



సిద్ధప్పగా పిలవబడిన సిద్ధేంద్రుడు యోగత్వం సిద్ధించి సిద్ధేంద్రయోగి అయ్యారు. శివతాండవ భంగిమనుంచీ "భామనే సత్యభామనే" పది ఆరువేల కోమలులందరిలోన ప్రేమదాననే అని సత్యభామా విరహాన్ని సుందరంగా కనిపించే సత్యభామ కృష్ణుని ఇష్టసఖిగా చేసారు. సుందరసుకుమార రసజ్ఞతల అష్టవిధ నాయక తత్వముతో దైవత్వము పొందిన సత్యభామ భక్తురాలు. ఏడు శతాబ్దాలుగా విశేషంగా తెలుగువారిని అలరించిన భామను వేల సం॥లు చిరంజీవిగా ఉండేట్టు, బామాకలాపం కూచిపూడి సంప్రదాయ నృత్యానికి ఆద్యుడు సిద్ధేంద్రయోగి. చిరంజీవులుగా విశాల విశ్వంలో తెలుగువారికి విశిష్ట స్థానం కల్పించిన కూచిపూడి నృత్యమహనీయుడు!

అన్నమయ్య (1408-1508)

వైష్ణవ మతం యొక్క అలంకార ప్రాధాన్యతను, హిందూ మతం యొక్క అద్వైయిత సిద్ధాంతాన్ని మేలు కలయిక జీవిత సాఫల్యానికి శృంగారం. కావాలని జానపదంగా మలచి ఏది వ్రాసినా, నీకే అని శ్రీ వెంకటేశ్వరస్వామిని 32 వేల కీర్తనలతో కొలిచి తరించాడు. అదివో, అల్లదివో అని వెంకటాచలాన్ని నడుస్తూ, అని మంత్రములు "ఇందే"ననే వెంకటేశు మంత్రాన్ని తారక మంత్రంగా నారాయణ మంత్రంతో సంధించి, ఆరాధన అలతి అలతి పదాలతో అమ్మవారితో శృంగార కీర్తనలు, "బ్రహ్మ కడిగిన పాదము" అని, "బ్రహ్మమొక్కడే పరబ్రహ్మమొక్కడే" అనే తత్వాల్ని స్వామికి వినిపించి "జో అచ్చుతానంద" లాలి పాటతో నిదురబుచ్చగలిగిన వాడొక్క అన్నమయ్యే ఈనాడు ప్రపంచంలో వెంకటేశ్వరస్వామి వంటి దైవం లేడని... అన్నమయ్య ఢంకా బజాయించి చెబుతూ, బహులేత ముఖ శైలీ చూపించిన వాగ్గేయకారుడు.

సద్గురు శ్రీశ్రీశ్రీ త్యాగరాజస్వామి (1767-1847)

త్యాగోపనిషత్ - 740 కీర్తనలు 268 రాగాలలో కూర్చి "త్యాగోపనిషత్" అనే మకుటాన్ని పొంది భారతదేశ ఇతిహాస కవులు వాల్మీకి, వ్యాసులతో సరితూగినవారు (త్యాగ్య(రాగ)రాజు, పరమార్థాన్ని భక్తితో రంగరించి చూపించారు. "స్వరార్ణవం"లోని ఆరోహణ అవరోహణ కీర్తనలు దివినించి భువికి తెప్పించుకున్న మహాత్ముడు. "సంగీతజ్ఞానము భక్తివినా సన్మార్గము కలదే" అని విశ్వసించి, ఆచరిస్తూ, ఆర్తి, ఆనందం, ఆరాధనం, ఆహ్వానం, అర్పణం, ఆవేదనం అన్వేషణం, అభ్యర్థనం -ఎన్ని అనుభూతుల్లో అవన్నీ రామాంకితంగా పరవశించే 24వేల సంకీర్తనం చేశారు. మన సంగీత శాస్త్రం- మన గురుపరంపరకి అవే మూలస్థానం. ఆయన ఆవిష్కరించిన, ఆలపించిన రామగాన సంకీర్తనాలు ఒక సంప్రదాయంగా భాసిల్లి విశ్వవ్యాప్తమయినాయి. తెలుగు వారొక్కరే కాక తమిళులు, కన్నడిగులు, మలయాళీలు అబ్బురంగా వారి కీర్తనలను ప్రచారం చేసారు, చేస్తున్నారు. తెలుగు భాషను ఇలా సంగీత సంప్రదాయంతో పరిరక్షించినవాడు త్యాగరాజస్వామి ఒక్కరే.

క్షేత్రయ్య (1590-1670)



సిద్ధేంద్రయోగి ప్రభావంతో ఉన్న కూచిపూడి అగ్రహారానికి ఆనుకుని ఉన్న మువ్వ గ్రామంలో పుట్టిన క్షేత్రయ్య అష్టవిధ నాయకుల చేత అనేక పదాలతో అభినయం చేయించారు. తంజావూరు రాజు విజయరాఘవుని కొలువులో వెంకట మఖి సహద్యాయంతో అటు మేలురకం సంగీతానికి ఇటు మేలురకం అభినయానికి మెరికల వంటి పదాలను కూర్చి మువ్వగోపాలునికి, ఖ్యాతి తెచ్చి పెట్టారు.

మునిపల్లె సుబ్రహ్మణ్య కవి (1630-1695)



చిత్తూరు జిల్లా కాళహస్తి క్షేత్రం జన్మస్థలం. 18వ శతాబ్దపు దామెర్ల వంశజుల కాలంలో మునిపల్లెవారు ప్రాచుర్యం పొందారు. ఆధ్యాత్మిక రామాయణం సంస్కృతంలో వేదవ్యాసుడు వ్రాయగా, తెలుగులో కీర్తనలు రూపంలో ఈయన రచించి ఆలపించి, వాల్మీకి రామాయణం సకలార్థ సాధకం అయితే, ఆధ్యాత్మిక రామాయణం మోక్షదాయకమనే నానుడి వచ్చినది వీరివల్లనే. వంద సంవత్సరాల క్రితం తెలుగునాట ప్రతి ఇంట గృహిణులు ఈ కీర్తనల్ను పాడుకునేవారు. శివతత్వం, విష్ణుతత్వం రెండూ కసి ఉన్న సంప్రదాయ కీర్తనలు కావడమే సంగీత విద్వాంసులు కూడా కచేరీలలో పాడుతూండే వారు దేవదాసీలు ఆలయాలలో పాడుతూ నృత్యం చేసేవారు. "అందముగా ఈ కథ వినవే రజతాచలసదనా" "వినీలవేణి వినులగుణవైని వినవే శార్వాణీ" కీర్తనలు జనం మనంలో కలిసిపోయాయి.

శ్రీశ్రీశ్రీ నారాయణ తీర్థులు (1675-1745)

"కష్టం కలయ సఖిసుందరం" అని శ్రవణమయ్యేసరికి నారాయణ తీర్థులే స్ఫురణకు వస్తారు. 'శ్రీకృష్ణ తరంగణి సలలిత సాహిత్యలాహిరి స్వరకల్పనలో మధురభక్తి తరంగాల మనసుని వ్రేపల్లెలోకి తీసుకుని వెడ్తుంది. మన రాష్ట్రానికి చెందిన ఈ మహావాగ్గేయకారులు శ్రీ నారాయణతీర్థుల సాహిత్యం అంతా సంస్కృత భాషా సంభరితమైనందున భారతదేశమంతా ఆయన తరంగాలు విస్తరించి నినదించాయి. గుంటూరు జిల్లాలోని 200 కుటుంబాలకు నేటికి కులదైవం నారాయణతీర్థులు. సంగీత సాహిత్య నృత్య కళారాధకులకి నిత్యవందనీయుడు నారాయణతీర్థులు.

రామదాసు (1620-1680)



ముస్లిమైన "కబీరు" ఉపదేశంతో రామనామం మంత్రం జపించి, మతసామ రస్యానికి సంకేతంగా నిలిచాడు. తెలుగువారి అయోధ్యానగరి భద్రాచలం, వైకుంఠ రాముడు కొలువైన ఈ ప్రదేశానికి, ఆ శ్రీరామునికి తన భక్తి ప్రవత్తులతో సంగీత, సాహిత్య హారతి అందించిన వాగ్గేయకారుడు రామదాసు. అసలు పేరు కంచర్ల గోపన్న. భద్రాచలం పరిసరాల్లో తహశీల్దారుగా ఉద్యోగం చేస్తూ అక్కడ రామా లయాన్ని నిర్మించి వైభవోపేతంగా రామకల్యాణములను నిర్వహిస్తూ, నవాబుగారి ఆగ్రహానికి గురై కారాగారంలో బంధించబడ్డారు. ఆయన ఆ సమయంలో రామునిపై ఆర్ధత నిండిన పరిపూర్ణ భక్తితో ఆలపించిన గీతాలు తేలిక భాషలో, నవరసభావాలతో, సహజాక్షర వాక్యాలతో సాగిన రామదాసు కీర్తనలు భద్రాద్రి రామునికి వెలుగారని కర్పూర హారతులు. తెలుగు బాషా పట్టిష్టతకు ఈయన ప్రధాన వాగ్గేయకారుడు.

ఇలా తెలుగు వాగ్గేయకారులు అకుంఠిత, అమేయ సంకీర్తనం కారణంగానే తెలుగు ఆచంద్రతారార్కమూ వర్ధిల్ల కలుగుతున్నది. ●

జర్మనులచే ఆరాధింపబడ్తూన్న తెలుగు శాస్త్రవేత్త

దండిభొట్ల విశ్వనాథశాస్త్రి

దండిభొట్ల వారివద్ద విశ్వానికి పనికి వచ్చే విజ్ఞానశాస్త్రం ఉండేదనేవారు. పైగా ఆయన పేరు కూడా విశ్వనాథశాస్త్రి. నదులూ, పర్వతాలూ, సాగరాలు దాటి జర్మనీ వెళ్లి ప్రపంచ నియంత హిట్లర్ చేతనే ప్రశంసలందుకున్న వ్యక్తి. జర్మనీలో ఇప్పటికీ వారి ఫోటో పెట్టుకుని గౌరవించే వ్యక్తులున్నారు. ఒకసారి మన భారత రాయబారి ఒక కార్యాలయానికి వెళ్లగా, ఈ ఫోటో ఎవరిదో చెప్పుకోండి అన్నారుట. ఆయన తెల్లమొఖం వేశారు. ఆ మహాత్ముడొక శాస్త్రవేత్తయనీ, అప్పటి జర్మనీ అధినేత హిట్లరే ఆయన్ను ఆంధ్రదేశం తన మనుషుల్ని ప్రత్యేకంగా పంపి, జర్మనీకి పలిపించుకున్నారనీ, జర్మనీ జనులకు సేవచేసి అక్కడే చివరి శ్వాస విడిచిపోయారని చెప్పడం, ఆ భారత రాయబారిని మరింత విస్మయుణ్ణి చేసింది.

ఇంతకూ ఎవరండీ ఆయన – మేము పేరు వినలేదు అన్నారు. ఆయనే కాదు తెలుగు ప్రజలెవ్వరికీ ఆయన పేరు తెలియదు. వారి ప్రజ్ఞా విశేషాలు తెలియవు. ఆయన పేరు దండిభొట్ల విశ్వనాథ శాస్త్రియని చెప్పేసరికి ఆ రామబారి విస్తుపోయారు. ఆ రాయబారి తెలుగువాడు కాకపోవడమే కారణం, గాకపోయిననూ తెలుగువారికి ప్రతిభావంతులైన తెలుగువారు తెలియదు; తెలుసుకోవాలన్న ఆసక్తి ఉండదు. ఇప్పటి వేగవంతమైన యుగంలో వారింటి పెద్దలైన తాతముత్తాతల పేర్లే తెలియవు, తెలుసుకోవాలన్న ఆసక్తిగానీ, తెలియదన్న బాధ కాని ఉండదు.

దండిభొట్ల వారిది గోదావరీతీర పట్నమైన రాజమహేంద్రవర పట్నం. పంచమమేదమైన ఆంధ్ర మహాభారతం పుట్టిన పునీత పట్నం. భారత, రామాయణ, భాగవత గ్రంథాలను ఆంధ్రీకరించి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆస్థాన కవి పదవి నధిష్టించిన శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారి ప్రదేశం. పవిత్ర గోదావరి నదీ ఏడు పాయలుగా ప్రవహిస్తున్న, సప్తవాహికా ప్రాంతం. కోటి లింగాలు వెలసిన పుణ్య ధామం. అలాటి పవిత్ర పట్టణం దండిభొట్ల విశ్వనాథశాస్త్రిగారి వాస స్థలం. చాలామంది వీరిని 'వ్యాకరణ శాస్త్రి' అనేవారు. వ్యాకరణంలో ఆయన దిట్ట. భట్టోజీ దీక్షితులు రచించిన వ్యాకరణశాస్త్ర సంబంధిత గ్రంథం "సిద్ధాంత కాముది"పై శాస్త్రిగారొక వ్యాఖ్యాన గ్రంథాన్ని రచించారు. నాగేశభట్టు విరచితమైన లఘుశద్ద వ్యాఖ్య యిది. ఈ గ్రంథం ఆలభ్యమంటున్నారు గానీ, హైదరాబాద్‌లోని ప్రభుత్వ ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో ఒక ప్రతి ఉన్నట్లు చెబుతున్నారు. విశ్వనాథశాస్త్రి గారి శిష్యులైన జనస్వామి వేంకటేశ్వరశాస్త్రి గారి వద్ద వ్రాసుకున్న 'ప్రతి' ఉన్నదంటున్నారు. ఇలాంటి గ్రంథాలను ప్రభుత్వం చేబట్టి ముద్రణం చేస్తే ఎంతో బాగుంటుంది.

అది మొదటి ప్రపంచం ముగిసిన కాలం. జర్మనీలో 'కెయిజర్' ప్రభుత్వం ముగిసింది. బందీ అయిన ఖైదీల్లోని ఒక సైనికుడు బయట ప్రపంచానికొచ్చాడు. నాజీ పార్టీని స్థాపించాడు. జర్మనీ నేతయైనాడు. నియంతగా మారాడు. ఆయనే 'హిట్లర్'. ప్రపంచపు పౌరుల్లో జర్మనులు గొప్పవారనీ, వారే ప్రపంచ పౌరులను తమ చేతుల్లోకి అనగా తన పెత్తనంలోకి తీసుకోవాలని, జర్మనులు అందరినీ ఉత్తేజపరిచారు. తనా పనిని చేబట్టానంటూ జర్మనీని పారిశ్రామికంగా అభివృద్ధి పరిచాడు. మరో ప్రపంచ యుద్ధమే కనుక వస్తే మారణాయుధాలను సేకరించి భద్రపరచుకోవాలని తలంచాడు. అంత పెద్ద ఎత్తున మారణాయుధాలను కలిగి ఉండాలంటే అణు అస్త్రాలను తయారుచేసుకోవాలి. అంటే అణు శాస్త్ర మేధావుల వల్లనే సాధ్యమవుతుంది. అయితే జర్మనీలోపల అణు శాస్త్రవేత్తలందరూ భారతీయ వేద విజ్ఞానాన్ని ఆకళింపు చేసుకుని, సంస్కృతంలో కల ఆ గ్రంథాలను తమ జర్మను భాషలోనికి అనువదించి, తత్ప్రకారంగా ఆయుధాలను తయారిస్తున్నారు. వాటిని గుట్టలు గుట్టలుగా గిడ్డంగు (గౌడోన్)లలో పేర్చేసరికి ఒకదానికొకటి తగిలి పేలిపోతున్నాయి. అలా పేలకుండా ఉపాయంతో పాటు ఆధునికమైన ఆయుధాలను తయారు చేసుకోవలసిన అవసరం ఉందని హిట్లర్ భావించాడు. అలాటి అణు అస్త్ర శాస్త్రవేత్తలు అప్పట్లో జర్మనీలో లేరు. ఆ విజ్ఞానమైనవారు భారత వేదశాస్త్ర సంస్కృత గ్రంథాలనుంచీ సేకరించినవే! అలాంటి సంస్కృత మూలమైన జర్మను గ్రంథాలను హిట్లర్ ఎన్నో జర్మనులో ముద్రింపచేశాడు. యజుర్వేదంలో కర్మకాండపరంగా, తాంత్రిక విద్యాపరంగా ఎన్నో అస్త్ర శాస్త్ర ప్రయోగాలు ఆయుధపరంగా ఉన్నట్లు తన శాస్త్రజ్ఞులు మూలకంగా 'హిట్లర్' గ్రహించాడు. వేద నిక్షిప్తమైన ఆ విషయాల్ను విపులీకరించగల భారత శాస్త్రవేత్త కోసం హిట్లర్ తన వేగుల ద్వారా ప్రయత్నించాడు.

ఆంధ్రదేశంలోగల దండిభొట్ల విశ్వ నాథశాస్త్రి వేదాన్ని గణితపరంగా, తాంత్రిక పరంగా, విజ్ఞానపరంగా ఔపోసన పట్టిన వాడనీ, మహామేధావియనీ, ఏ విషయా న్నైనా ఇట్లే వివరించగల విజ్ఞానియని తెలుసుకున్నాడు.

నిజానికి విశ్వనాథశాస్త్రికి శాస్త్రాధ్యయనం, శోధనం, పరిశోధనం తప్ప వేరు దృష్టి లేదు. భార్య బజారుకు వెళ్లి, ఏ వస్తువు తెమ్మనినా తాత్సారం చేసేవాడు. డబ్బు లేక కాదు, ఇంటి విషయాన్ని పట్టించుకునేవాడు కాడు. ఒకసారి ఆవిడ తలదువ్వుకునే దువ్వెన విరిగిపోయింది. ఒకటి తెచ్చి పెట్టమని అడిగింది. రోజులూ, వారాలూ గడిచాయ్. ఆవిడ పోరు పెట్టినా వినలేదు. తల్లి రెండు చివాట్లు వేసేసరికి, ఓ చీటిమీద వ్రాసుకుని బజారుకి వెళ్లి, ఓ షాపువాణ్ణి – నా భార్య దువ్వెన లేదని గొడవ పెడ్తుందని, ఓ పది దువ్వెనలు ఇద్దూ అంటే– వాడు ఆయన మీద గౌరవంతో ఏ దువ్వెనలో తెలియక ఇన్ని కొయ్య దువ్వెనలూ, కొమ్ము దువ్వెనలూ మూట గట్టి యిచ్చాడట. ఇంటికి వచ్చి ఆ దువ్వెనల మూటను భార్యముందు పడేసి, నే చచ్చే వరకు ఈ దువ్వెనలు వాడుకో, నన్ను మళ్లీ బజారుకు వెళ్లమనకు అన్నారట. ఈ విషయాన్నో వ్యాసకర్త ఆయన శాస్త్రాధ్యయన పరిశోధనలను గూర్చీ, అవిశ్రాంత గణిత కార్యకలాపాలను గూర్చీ విశ్లేషలను గూర్చీ విశ్లేషిస్తూ చెప్పారు.

హిట్లరే తన అధికారులను భారతదేశానికి పంపిస్తూ, విశ్వనాథశాస్త్రిగారి నెలాగైనా ఒప్పించి తీసుకుని రమ్మన్నారు. వారు ఆంధ్రదేశంలో ప్రవేశించి, రాజ మండ్రి వెళ్లారు. కానీ ఆయన పనిమీద విశాఖపట్టణం వెళ్లినట్లు తెలుసుకున్నారు. వారు మళ్లీ వెదుక్కుంటూ విశాఖపట్నం వెళ్లారు. వారు కొత్తవలస వెళ్లినట్లు తెలిసి, మరల కొత్తవలస ఏ రవాణా సౌకర్యమూ లేకపోయేసరికి వాళ్లూ కాలినడకనే వెళ్లారు. శాస్త్రిగారిని వారి బంధువుల ఇంట కలుసుకున్నారు. ఆంధ్రదేశం విడిచి వెళ్లకూడదనుకుంటున్న ఆయన్ను ఒప్పించి జర్మనీ తీసుకుని వెళ్లారు. వారొక్కరే జర్మనీలో ఉంటూ భార్యకు నెలనెలా డబ్బు పంపేవారు. ఆయన తిరిగి ఆంధ్రదేశానికి రాలేదు. అటు తరువాత వారి భార్యకు వచ్చే ఆ డబ్బు కూడా రాకుండా పోయింది. అంటే వారి అసువులు జర్మనీ గడ్డపైననే కలిసి పోయాయని భావించాలి.

జర్మనీ వారు విశ్వనాథశాస్త్రిగారి శాస్త్ర పరిజ్ఞానాన్ని బాగా ఉపయోగించు కున్నారు. మంచి గౌరవ స్థానం యిచ్చారు. వారి స్మృతిచిహ్నంగా ఉన్న ఫోటోను భారత రాయబారి చూశారు. ఆంధ్రులు ఆయన ప్రతిభా సంపత్తిని వినియోగించు కోకపోయినా జర్మనులు ఉపయోగించుకున్నారు. భారతీయులిలాటి శాస్త్రజ్ఞులను గుర్తించకపోయినా ఓ జర్మను పాలకుడు గ్రహించాడు. ●

'పారిజాతాపహరణం' కర్త ముక్కు తిమ్మన్న

కృష్ణదేవరాయలు వారి ఆస్థానం అష్టదిగ్గజాల పెట్టు. ఆ కవుల్లో ఒక్కొక్కరిది ఒక్కొక్క బాణీ. వీరిలో ముక్కుతిమ్మన గారిదొక ప్రత్యేక బాణీ. ప్రసిద్ధి చెందిన వీరి కావ్యం పారిజాతాపహరణం. నయన మనోహర కావ్యం. చూచుటకు చిన్నదైనప్పటికినీ రస పరిమళంలో కడు గొప్పది. అలనాడు ఆంధ్ర రసికుల్ని మైమరపించిన కావ్యమేదయ్యా యని ప్రశ్నించినపుడు పారిజాతాపహరణమే గుర్తుకు వస్తుంది. దీన్ని ఆధారంగా చేసుకొనే పానుగంటి నరసింహారావు గారు 'పారిజాతాపహరణం'ను నాటకంగా మలిచారు. ఆ రోజుల్లో ప్రసిద్ధ నటులందరూ ఈ నాటకాన్ని ప్రదర్శించి పానుగంటి వారికి పట్టం గట్టినవారే!

ఇహ తిమ్మన్నగారి విషయంలోకి వచ్చినప్పుడు– ఆయన తన కావ్యం చివర నందితిమ్మన యనీ–కౌశిక గోత్రీకుడననీ ఆపస్తంబ సూత్రుడననీ, ఆరు వేల నియోగి ననీ, తిమ్మాంబా సింగమామాత్యుల కుమారుడననీ, మలయ మారుతి కవికి మేనల్లుడననీ, ఆఘోర శివగురు శిష్యుడననీ సీసపద్యంలో వ్రాసుకున్నారు.

విషయానికి వస్తే కృష్ణదేవరాయలు తండ్రి నరస నాయకునికి వరాహపురాణం అంకితం చేసిన జంట కవులు నంది మల్లయ్య, ఘంట సింగన అను జంట కవుల్లోని ఘంట సింగన్న కవికి మలయమారుత కవి యనే పేరు ఉన్నది. మన ముక్కుతిమ్మనగారు ఘంట సింగన్న కవికి మేనల్లుడు. వీరిరువురూ ఆఘోర కవి శిష్యులు.

తిమ్మన కవి మేమమామ సహాయంతో శ్రీకృష్ణదేవరాయలు వారి సంస్థానంలో చేరి, అష్టకవి దిగ్గజాల్లో ఒకరిగా పేరు ప్రసిద్ధులు పొందారు, వీరెంతకాలం జీవించినదీ తెలియదు గానీ, రాయలువారు పోయిన తరువాత కూడా వీరు జీవించినట్లు చెబుతారు. తిమ్మనగారు రాయలవారితో యుద్ధయాత్రలో కూడా పాల్గొనేవారని తెలుస్తుంది. క్రీ.శ. 1522లో గయలో వేయించిన విజయ శాసనానికి కర్త నంది తిమ్మనగారే! ●

తిమ్మనగారిని ముక్కుతిమ్మన అనే పేరు కూడా ఉన్నది. ఒక చక్కని చుక్క ముక్కును కడు చక్కగా వర్ణిస్తూ 'పద్యం' చెప్పడంతో ముక్కుతిమ్మనగా ప్రసిద్ధి చెందారని కొందరంటారు.

ఆయన ముక్కు పెద్దదిగా ఉండడం వలన ముక్కుతిమ్మన అన్నారని కొందరంటారు. మొత్తానికి నంది తిమ్మన కన్ను ముక్కు తిమ్మనగానే ప్రసిద్ధి నొందిన రాయలవర్గంలోని అష్టదిగ్గజ కవి. గాకపోయిననూ రాయలవారి ఆస్థానంలో తిమ్మన్నలు ముగ్గురు నల్వురుండడం (తిమ్మన కవి, కావలి తిమ్మన ప్రభృతులు) వలన నందితిమ్మన గార్ని ముక్కుతిమ్మన నామాన్ని సార్థకనామం చేశారు. పారిజాతాపహరణం కథ భాగవతంలోనూ, విష్ణుపురాణంలోనూ, హరి వంశంలోనూ ఉన్నప్పటికినీ తిమ్మనగారు 'హరికథా సారము' అను కన్నడ గ్రంథం నుంచి కథావస్తువును గ్రహించినట్టూ, అందులోని పద్యాలను మక్కీకి మక్కీగా అనువదించారనీ అంటారు.

తిమ్మనగారు 'వాణీ విలాసం' అనే మరో కావ్యాన్ని వ్రాసినప్పటికినీ 'పారిజాతాపహరణం' ఒక్కటే లభిస్తున్నది. ఈ కావ్యాన్ని ఆయన రాయలు వారికే అంకిత మొసగారు.

పిల్లలకు నాలుగు శతక పద్యాలైనా నేర్పండి!

భారత భారతియైన సరస్వతి తెలుగుకు ప్రసాదించిన వరం శతక సాహిత్యం. పూర్వపు తెలుగువారు పెద్దపెద్ద చదువులు చదువుకోపోయి ననూ నాలుగు శతక పద్యాలులైననూ నేర్చుకునేవారు. ప్రతీ పద్యంలోనూ ఒక నీతి, ఒక సత్యం, ఒక ధర్మం, ఓ భక్తి, పెద్దలపట్ల గౌరవం వినయం అలవరచే పద్యాలతో శతకం ఉండేది.

ముఖ్యంగా బద్దెనగారి సుమతీ శతకం చిన్న పదాలతో, నీతి సూక్తులతో నిండి వున్న శతకం.

అక్కరకురాని చుట్టము
మ్రొక్కిన వరమీయని వేల్పుమోహరమున తా
నెక్కిన పారని గుఱ్ఱము
గ్రక్కున విడువంగ వలయు గదరా సుమతీ!

–ఎంతటి చక్కని చిన్న పదాలో చూడండి. అలాగే కృష్ణ శతకములోని–

నీవే తల్లివి తండ్రివి
నీవే నా తోడు నీడ నీవే సఖుడౌ
నీవే గురువు దైవము
నీవే నా పతియు గతియు నిజముగ కృష్ణా

– సంపూర్ణముగా తన్ను భగవతార్పణం చేసుకునే శరణాగతి తత్వం ఈ పద్యంలో ఉన్నది. ఇందువలన బాల్యం లోనే పిల్లలకు భక్తి ఏర్పడుతుంది. భాగవతత్వం పిన్నతనంలోనే అలవడుతుంది. అలాగే

హరి యను రెండక్షరములు
హరియించును పాతకంబు

– ఈ రెండు పాదాలే చాలు భగవత్చింతనం అలవాటు చేసుకోవడానికి అనువైన పదపారిజాతాలవి.

అలాగే వేమన శతకంలో ఎన్నో నీతి బోధకాలు సోదాహరణంగా ఉన్నాయ్.

తల్లిదండ్రుల మీద దయలేని పుత్రుండు
పుట్టనేమి వాడు గిట్టనేమి
పుట్టలోని చెదలు పుట్టవా గిట్టవా
విశ్వదాభిరామ వినురవేమ!

– తల్లితండ్రులపై భక్తి ప్రపత్తులను కలిగించే పద్యమిది. వేమన పద్యాలన్నీ ఇదే బాణిలో నీతిబోధకంగా ఉంటాయ్.

ఇహ కుమార శతకానికి వచ్చేసరికి–
చేయకుము కాని కార్యము
పాయకము మదిన్
శుభం బవని భోజన వలన్
జేయకుము రిపుగృహంబున

– ఎంత సులభమైన పదములు. ఎంతటి నీతి బోధన. ఇలాగే కుమార శతకం నీతిబోధకంగా సాగుతుంది.

ఆధునికంగా ఓ యువకవి వ్రాసిన నీతి శతకంలో–

కష్టపెట్టబోకు తల్లి మనసు
నష్టపెట్టబోకు నాన్న పనులు
తల్లిదండ్రులన్న దైవసన్నిభులురా
లలిత సుగుణజాల తెలుగు బాల

–ఈ పద్యంలోని ఒక్కొక్క చరణం తల్లిదండ్రుల పట్ల భక్తి ఉప్పతిల్లుతూంటుంది.

ఈ శతక రచన అనెడిది చిన్నచిన్న పదాలతో పన్నెండవ శతాబ్దంలోనే– ఆఖరి పదం ఆ శతకానికి సంబంధించిన మకుటంతో ప్రారంభమైంది. వీటిలో నీతి, భక్తి, వైరాగ్య, శృంగార శతకాలు కూడా ఉన్నాయ్.

పిల్లలకు మాటలు వచ్చిన తల్లి తండ్రులు **'శ్రీరాముని దయచేతను–నారూఢిగ సకల జనుల'**నో, **శ్రీ రుక్మిణీశ కేశవ నారద సంగీత లోల నగధర శౌరీ–** యనో– శ్రీకారంతో పద్యం చెప్పి– 'అపకారికి నుపకారము నెపమెన్నగ సేయువాడు నేర్పరి సుమతీ!' అన్న నీతి సారాంశాన్ని నీటుగా బుర్రలకెక్కించేవారు.

ఇపుడు ఇళ్లవద్ద తల్లిదండ్రులు గానీ, పాఠశాలలో ఉపాధ్యాయులు గానీ– ఈ శతకాలను వల్లింపచేసే అవకాశం లేనందువల్లనే, పిల్లలకు నీతిరహితమూ, హింసాయుతమైన విజ్ఞానం మదిలో నెలకొంటున్నది.

మా రోజుల్లో ఐదవ ఏడు వస్తేనే గాని పాఠశాలల్లో చేర్చేవారు కాదు. అప్పుడు కూడా **'ఓం నమశ్శివాయ'**తోనే ఇంటి వద్ద అక్షరాభ్యాసం జరిగేది. అప్పటికి ఇంటివద్దనే ముఖ్యమైన శతక పద్యాలను నేర్చుకుని ఉండేవారం. బడిలోని పంతుళ్లు– ఏదో ఒక శతకాన్ని తరగతుల్లో వల్లింప చేస్తుండేవారు. ఇప్పుడు అమ్మా నాన్నా సంస్కృతి పోయి, మమ్మీ, డాడీ, పలుకడం వచ్చిన తరువాత, శతకాలు నేర్చేవారూ, నేర్పేవారూ కరువయ్యారు. తిరిగి ఆ రోజులెపుడు వస్తాయో– అపుడే నీతి నెరింగిన శాంతివర్తనులైన పౌరులు తయారవుతారు. ●

'కుమ్మరి మొల్ల'ను తాలిగా తెరమీద చూపించాలని శ్రమించినది కృష్ణవేణే!

● కృష్ణవేణి

గొల్లభామ, మదాలస మన దేశం, లక్ష్మమ్మ, కీలుగుర్రం వంటి విలక్షణ చిత్రాలను నిర్మించిన శోభనాచల అధినేత్రి కృష్ణవేణి, నాగయ్య దర్శకత్వాన శోభనాచల బేనర్‌లో కుమ్మరి మొల్ల నిర్మిద్దామనుకుని స్క్రిప్టు కూడా తయారుచేసుకున్నది. నాగయ్య దేవులపల్లి కృష్ణమూర్తి కలిసి స్క్రిప్టును తయారుచేశారు. నాగయ్య-కృష్ణ శాస్త్రి కలిపి మూడు పాటలను సిద్ధం చేశారు. సాలూరి రాజేశ్వరరావు సంగీత దర్శకులుగా నియమింపబడ్డారు. కృష్ణవేణి మొల్లగా, నాగయ్య మొల్ల తండ్రిగా చిత్రీకరణం ప్రారంభమై, ఒక షెడ్యూలు పూర్తిచేశారు. అప్పుడు రంగంలోకి వస్తున్న నవయుగ పిక్చర్సు వారు పంపిణీ అగ్రిమెంటు చేసుకున్నారు. తమ సంస్థ ప్రారంభ చిత్రంగా విడుదల చేయాలని ఛాలంజీగా తీసుకున్నారు.

నాగయ్య అంతక్రితం తయారుచేసుకున్న 'నా యిల్లు' స్క్రిప్టును చూచి ఓ మిత్రుడు 3 నెలల్లో నిర్మించే పనిలో అయిపోతే చిత్రానికి ఫైనాన్స్ చేస్తామన్నారు. నాగయ్య గారీ విషయాన్ని కృష్ణవేణికి చెప్పారు. ఈలోగా కృష్ణవేణి ఏ. నాగేశ్వరరావుకు కూడా చెప్పారు. మూడు నెలల షెడ్యూల్‌లో ముగియవలసిన 'నా యిల్లు' 6 నెలల పైగా నిర్మాణం దాటింది. దానితో కృష్ణవేణికి విసుగెత్తి నిర్మాణం ఆపు చేసింది. ఈ చిత్రానికి అసిస్టెంటుగా పనిచేసిన జర్నలిస్టు ఇంటూరి వెంకటేశ్వరరావు ఈ స్క్రిప్టును నవలగా వ్రాసి అచ్చు వేసుకున్నారు తమ అనుమతి లేకుండా నవల వ్రాయడమేంవిటని నిర్మాతలు అడిగారు. ఇంటూరి క్షమాపణ కోరారు. తరువాత కథ సద్దుమణిగింది. అలా ఆ నవల ఎల్వీ ప్రసాద్ చేతికి వెళ్లింది. ఆయనా తియ్యలేదు, తరువాత ఆ నవల హక్కుల్ని ఇంటూరి తిరిగి వ్రాయించుకున్నారు. డి.యల్. నారాయణ తీసుకుని ప్రకటన కూడా యిచ్చారు. టి.వి.యస్. శర్మచే స్కెచ్‌లు వేయించారు. ఆయన కూడా తీయలేదు. చివరకు హాస్యనటుడు పద్మనాభం ఆ నవల హక్కుల్ని కొని వాణిశ్రీ కుమ్మరి మొల్లగా చిత్రం తీశారు. ఈ చిత్రం 100 రోజులు ఆడింది. ఆంధ్ర ప్రభుత్వం వారి అవార్డునూ పొందింది.

ఇలా 'కుమ్మరి మొల్ల' నలుగురి చేతులు మారినప్పటికీ ఇంటూరి వెంకటేశ్వరరావు పేరును స్క్రిప్టు రైటర్‌గా తెరపైన వేశారు.

నాగయ్య కారణంగా ఆలస్యమై, నాలుగు చేతులు మారిన మొల్ల వాణిశ్రీ కోసమే పుట్టిందా అన్నట్లున్నది. చిత్రసీమలోని విచిత్రాలు ఇలా ఉంటాయ్. ●

SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.

Phones : 28152387, 28154653

The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation

ఆంధ్రకేసరి నటించిన నూట ఇరవై ఏండ్ల గయోపాఖ్యానం!

తెలుగువారు పద్యాన్నీ, పద్యకావ్యాల్ని ఆదరించినట్లుగానే పద్యనాటకాల్ని, అందునా పౌరాణిక పద్యనాటకాల్ని విశేషంగా ఆదరించారనడానికి చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారి 'గయోపాఖ్యానం' నాటకాన్ని చెప్పుకోవాలి.

1890 సం॥ము ఏప్రిల్‌లో గయోపాఖ్యానం నాటక తొలి ప్రదర్శనం జరిగింది. విశేషమేమన ఈ నాటకంలో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులుగారు మూడు, ఐదు అంకాలలో అర్జునుని పాత్రనూ, ఇతర అంకాల్లో చిత్ర లేఖ స్త్రీ పాత్రనూ నటించడం విశేషం. చిత్రకారుడు కుంచెతో రంగులు దిద్దినట్టు ఆ రెండు పాత్రలనూ అద్భుతంగా నటించారాయన. అర్జునుని పాత్రలో వీరరసాన్ని అద్భుతంగా పోషించి అపుడే తన ధీరతను ప్రకటించారు.

ప్రకాశం పంతులుగారి నాటకాల గురువు యిమ్మానేని హనుమంతరావుగారు గయుని పాత్రను పోషించారు. తొలి ప్రదర్శనమే అద్భుతమైన రక్తిని కట్టింది.

1909 సం॥ వరకూ ఈ నాటకం అముద్రితంగానే ఉంది. 1909 ముద్ర జరిగినప్పటి నుంచీ లక్ష ప్రతులు విక్రయించబడిన నాటకమిదే!

రాజమహేంద్రవరం (రాజమండ్రి)లో రాజమహేంద్రవర హిందూ నాటక సమాజాన్ని స్థాపించిన హనుమంతరావు నాయుడు గారే లక్ష్మీనరసింహం పంతులుగారిచే ఈ నాటకం రచింపచేశారు. రామకవియనే పూర్వకవి వ్రాసిన ఓ పద్య కావ్యాన్ని ఆధారంగా చేసుకుని చిలకమర్తి వారీ నాటకాన్ని రచించారు. భక్తునికీ భగవంతునికీ మధ్య అనగా, బావా బావమరదులైన కృష్ణార్జునుల మధ్య పెరిగిన విరోధమే ఈ నాటక ప్రధానాంశం. ఇదో కల్పితమే! నిజమైనంత వేడిగా కృష్ణార్జునుల వైరం యుద్ధం వరకూ వెడుతుంది. తిరిగి సుఖాంతమవుతుంది.

జలనిధులుకు గాక, కులశైలము లేదును గ్రుంకు గాక' అంటూ కృష్ణుడు భీకర ప్రజ్ఞను చేస్తూ పద్యం పాడడం, 'అల్లుడా! రమ్మని ఆదరమ్మున బిల్వ పంపు మామను బట్టి చంపగలమె, జలకేళి నవరించు జవరాండ్ర కోకల నెత్తుకుపోయి చెట్లెక్కగలమె' అంటూ అర్జునుడు దెప్పి పొడుస్తూ పాడే పద్యమూ ఆంధ్రా నాటకప్రియుల నోళ్లలో నూట ఇరవై యేళ్లుగా ఊరుతున్నాయ్. ఈ నాటకానికెంతో చరిత్ర ఉన్నది. రెండు మూడు పర్యాయములీ కథ వెండితెరకెక్కి విజయవంతమైంది.

ఈ నాటక ప్రభావమో, ఏమోగాని ఇలాటి వైర ఇతివృత్తంతో 'శ్రీరామాంజనేయ యుద్ధం' నాటకమూ వచ్చింది. రెండు పర్యాయములు చిత్ర నిర్మాణమూ జరిగి విజయవంతమైంది. ఈ నాటకమూ అంతే - రామాంకితుడైన భక్తుడు ఆంజనేయుడూ, దైవాంశ సంభూతుడైన శ్రీరామచంద్రుని మధ్య యుద్ధము వరకు వస్తుంది. భక్తికీ శక్తికీ పోరాటమన్నారు. పరమేశ్వర ప్రమేయంతో సుఖాంతమవుతుంది.

రెండూ పురాణ విరుద్ధమైన కల్పిత గాథలే అయినప్పటికినీ జనం ఆదరించారు, పద్యాల జోరుకు పరవశించారు.

గయోపాఖ్యానం నాటకం ఇలాటి కల్పితగాథలకు మూలమైంది. అంటే మూల ప్రభావం పద్యములే!

అటు తరువాత పాండవుల కురుక్షేత్ర సంగ్రామ గాథయైన తిరుపతి వేంకట కవులు 300 పద్యములతో రచించిన పాండవోద్యోగ విజయములు దీనినే కురు క్షేత్రమని అంటారు. లక్షకు పైగా ప్రదర్శనలు జరిగింది, ఇంకా జరుగుతూంది. ●

ద్వారం వేంకటస్వామి నాయుడు

పాశ్చాత్య దేశాలనుండి మన దేశంలోకి అడుగిడిన వయొలిన్ వాద్యాన్ని, ఒక సోలో వాద్యంగా మలచిన ఘనత, మన ఆంధ్రులలో ద్వారం వేంకటస్వామి నాయుడు గారికే దక్కుతుంది! తన సోదరులైన వేంకటకృష్ణయ్యగారి వద్ద తొలుత సంగీత విద్యను అభ్యసించారాయన.

విజయనగరం సంగీత కళాశాలలో విద్యార్థిగా చేర్పించేందుకు, తన తమ్ముని, మహారాజాగారి సమక్షానికి తీసుకువెళ్లారు వేంకటకృష్ణయ్యగారు. ప్రవేశ పరీక్షలో, నాయుడుగారి అద్భుత ప్రజ్ఞను చూసిన రాజాగారు, ఆయనను విద్యార్థిగా కాక, వయొలిన్ ప్రొఫెసర్‌గా నియమించి, ఉద్యోగ బాధ్యతలప్పచెప్పారు! 26 ఏళ్లకే అధ్యాపక వృత్తి స్వీకరించిన నాయుడుగారు, త్రికరణ శుద్ధిగా తన బాధ్యతను నిర్వహించి, అనతికాలంలోనే ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందారు.

1927లో మద్రాసులో జరిగిన అఖిలభారత సంగీత సదస్సులో నాయుడుగారు చేసిన కచేరీ, ఆయనకు అగ్రశ్రేణి వాయులీన విద్వాంసునిగా కీర్తి తెచ్చిపెట్టింది. అదిమొదలు, ఆయన కచేరీ పరంపర అప్రతిహతంగా కొనసాగింది. ఉద్దండులైన ఎందరో విద్వాంసులకు తన వాయులీన సహకారాన్ని అందించారాయన. అయితే, ఒక సందర్భంలో ప్రక్కవాద్య కళాకారునిగా తనకెదురైన ఒక చేదు అనుభవానికి కలత చెంది, సహకార వాద్యానికి స్వస్తి పలికి, సోలో వాద్యాన్ని సాధన చేశారాయన. ఏనాడూ తిరిగి ప్రక్కవాద్యం వాయించలేదాయన!

కర్ణాటక, హిందుస్థానీ, పాశ్చాత్య సంగీతాల మేలుకలయికతో ఒక విలక్షణమైన సోలో సంప్రదాయానికి శ్రీకారం చుట్టి, 1938లో వెల్లూరులో తొలి వయొలిన్ సోలో కచేరీ చేశారాయన.

'సంగీతం అనేది నిత్య నూతన స్రవంతి. అది, కల్పనకు, భావోద్దీపనకు ఆలవాలం కావాలి' అనేవారాయన. ఆబాలగోపాలమూ మెచ్చే 'అపనా తనామనా..' వంటి జానపద గీతాలకూ కచేరీలో స్థానం కల్పించి, వాటిని తన అంగుళులపై అలవోకగా పలికించేవారాయన.

దీపావళి అమావాశ్యనాడు పుట్టిన ఆయన, దృష్టిలోపమనే చీకటిని తన నాద జ్యోతితో పటాపంచలు చేసి, జగతికి సుస్వరపు వెలుగులు పంచారు. అంధుల సంక్షేమ నిధికై, 1952 లో ఢిల్లీలోని 'నేషనల్ ఫిజిక్స్ లేబొరేటరీ'లో కచేరీ చేశారాయన. కర్ణాటక సంగీతంలో సాహిత్య ప్రాధాన్యత నెరిగినవారు కావటంచేత, గ్రంథాల లోని కీర్తనల సాహిత్యార్థాలను తన శిష్యులతో చదివించుకొని, వాటిని నిత్యం మననం చేసుకొనేవారు.

ఒక సందర్భంలో కచేరీకి వెళ్లబోతూ తన శిష్యుని పిలిచి, తాను ఆరోజు వాయించదలచిన ఒక త్యాగరాజ దివ్యనామ సంకీర్తనలోని మూడవ చరణం సాహిత్యం తనకు గుర్తు రావట్లేదని, ఆ సాహిత్యాన్ని, పుస్తకంలో చూసి చదవమని కోరారు నాయుడుగారు. నిజానికి వాద్యకారులు ఒక చరణం మాత్రం గుర్తుపెట్టుకొని, తక్కిన చరణాలన్నింటినీ అదే బాణీలో వాయించేస్తారు. ఎలాగూ సాహిత్యం వాద్యంలో వినపడదు కదా! అనే ధోరణితో... అయితే నాయుడుగారు తాను వాయించే ప్రతి సాహిత్య భాగాన్ని మనసులో పాడుకుంటూ వాయించేవారు. అందుకే వారి వాద్యంలో సాహిత్యం చక్కగా వినిపించేది!.

'పద్మశ్రీ', 'సంగీత కళానిధి', 'గానకళావిశారద', 'గాంధర్వ విద్యాభూషణ', 'కళాప్రపూర్ణ' బిరుదాలతోపాటు, తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ పట్టా కూడా అందుకున్నారు నాయుడుగారు.

వయొలిన్ వాద్యాన్ని 'అపస్వరాల కొయ్య' అనేవారాయన! 'నిత్యసాధన' అనే తపస్సుతో దానిని 'సుస్వరాల శయ్య' గా మలచుకున్నారాయన. జానెడు నిడివిగల ఫిడేలు ఫింగర్ బోర్డుపై త్రిస్థాయిలనూ శ్రుతిపక్వంగా పలికించటం ఆయన వాద్యం లోని విశేషం. అర్ధరాత్రి పూట లోకమంతా నిద్దురపోయే సమయంలో ప్రశాంత నిశ్శబ్ద సమయంలో తన వాయులీన సాధన ప్రారంభించేవారు నాయుడుగారు! ఒక్కొక్కసారి సాధన పూర్తి అయేసరికి తెల్లవారిపోయేది... 'మనం ఒక్కరోజు సాధన చేయకపోతే, మన తప్పులు మనకు తెలుస్తాయి. అదే రెండురోజులు వరుసగా సాధన లేకపోతే ఆ తప్పులు శ్రోతలకూ తెలుస్తాయి' అనేవారాయన.

అపశ్రుతిని కలలోనైనా తట్టుకోలేక పోయేవారాయన. ఒకసారి నాయుడుగారి సోలో కచేరీ వేదికపై జరుగుతోంది. ఆనాటి కచేరీ మధ్యలో ఒకచోట సహకారవాద్య విద్వాంసునికి చిన్న అపశ్రుతి పొడచూపింది. అంతే... నాయుడుగారు మన స్తాపంతో, సహకార విద్వాంసుని 'ఆపమని' సంజ్ఞ చేశారు. ఆ విద్వాంసునితో పాటు శ్రోతలూ నిర్ఘాంతపోయారు. కొంతసేపటికి తేరుకొని, మరలా కచేరీ కొన సాగించారాయన... సహకార వాద్యం లేకుండానే ఆ కచేరీ పూర్తి అయింది. తరువాత ఆ సహకార విద్వాంసుడు నాయుడుగారిని క్షమించమని కోరారు. అంతటి సునిశిత దృష్టి ద్వారంవారిది!

1964 వ సంవత్సరంలో తనువుచాలించేవరకూ ఆయన వాయులీన సాధన, శోధన కొనసాగింది. 'శ్రోతల హృదయ ద్వారాలు తెరచి, తన నాదయోగంతో వారికి భగవంతుని దర్శనం చేయించగల అసాధారణ శక్తి ద్వారం వేంకటస్వామి నాయుడు గారి వాయులీనానికి ఉంది' అనటం అతిశయోక్తి కాదు.

నాయుడుగారి శిష్యులలో సర్వశ్రీ మారెళ్ల కేశవరావు, ద్వారం మంగతాయారు, ద్వారం సత్యనారాయణ, ద్వారం భావనారాయణరావు, రాధానారాయణన్ ముఖ్యులు.

విశాఖ సాగరతీరంలోని ఏర్కేబీచ్ లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నాయుడుగారి విగ్రహం ఏర్పాటు చేయటం ఎంతైనా అభినందనీయం.

– మొదుముది సుధాకర్

తియ్య పెరుగులో పునుగులు 'తిమ్మనలు'

తిమ్మనం అంటే, ఐక్యత అనే అర్థంలో 'మనంమనం' అనటం 'రమ్మన్నారు తిమ్మన్న బంతికి' అనే తెలుగు సామెత తెలిసిందే! కోతీ బావకు పెళ్ళంట– పాటకి ఈ సామెత కొనసాగింపు. త్రిమ్మరి (తిరుగుతూ ఉండేది) కాబట్టి. తిమ్మన అయ్యుంటుంది. ఈ తిమ్మన్న మన వంటకాలలో కూడా కనిపిస్తుంది. శ్రీనాథుడు కాశీఖండం (7.186)లో తిమ్మనం గురించి ప్రస్తావించాడు. ఇది రెండు రకాలుగా కనిపిస్తోంది. 'తాల తిమ్మనం' అంటే తాలింపు పెట్టిందని, 'పాక తిమ్మనం' అంటే బెల్లం, బియ్యప్పిండి కలిపి పాకం పట్టిందని, కొందరు పాయసాన్ని తిమ్మనం అంటే, కొందరు మజ్జిగ పులుసుని ఆ పేరుతో పిలిచారు. ఈ తికమక ఉంది కాబట్టే ఇది పేరుకు తగ్గ వంటకం అయ్యింది. బెల్లాన్ని దంచి, నీళ్లు మాత్రమే పోసి ఉడికిస్తూ, రుబ్బిని బియ్యప్పిండిని అందులో కలిపి గరిట జారుగా చేసిన వంటకాన్ని కొన్ని తెలుగు ప్రాంతాల్లో 'తిమ్మనం' అంటారు. ఏలకులు, జీడిపప్పు, వగైరా పాయసంలో కలుపుకొన్నట్టే ఇందులోనూ కలుపుకోవచ్చు. పాలుపోయకుండా కాచిన పాయసం ఇది. దీన్ని విడిగా తినవచ్చు లేదా అప్పచ్చుల్లో నంజుకోవచ్చు 'తిమ్మనం' అనేది 'తేమనం' లాంటి వంటకమేనని శబ్దార్థ చంద్రికలో ఉంది. తేమనం సంస్కృతం పేరు. కొన్ని సంస్కృత నిఘంటువులు తేమనం అంటే సాంబారు అనే అర్థం చెప్తున్నాయి. 'తేమనం న పరివేషితవతి ఏవ' అంటే అన్నంలో సాంబారు ఇంకా వడ్డించలేదని అర్థం. పాళీ నిఘంటువులో తేమనం అంటే, తేమ కలిగేలా చేయటం (Wetting) ప్రాకృతంలో 'తీమణ' అంటారు. తింట, తిన్న, తిమిత, తిమ్యతి, తీమయతి, తీమన, తేమ, తేమన, తేమయతి, తైమ్య... ఇవన్నీ తేమని సూచించే సంస్కృత పదాలు. 'తేమనం' వాటిలో ఒక భాగం.

క్రీ.శ. 1200 నాటి గుజరాతీ లావణ్యసామి రూపొందించిన బిమలప్రబంధ గ్రంథంలో ఈ తేమనం 'ఖాదీ' అనే వంటకం లాంటిదేనని ఉన్నట్టు కె.టి. అచ్చయ్య

ఫ్రైడ్ రైసులు వచ్చిన తరువాత రుచ్యమైన తెలుగు వంటకాలు కనుమరుగాయే!

తన 'ఇండియన్ ఫుడ్' పుస్తకంలో ఉదహరించారు. 1520 నాటి 'వరణక సముచ్చయ' అనే గ్రంథంలో ఖాదీని ఇంగువల తాలింపు పెట్టిన పెరుగు వంటకంగా పేర్కొన్నారు. ఇందులో గారెలపిండితో చిట్టిగారెలు గానీ చిన్న ఉండళ్ళాంటి పునుగులు గానీ నానబెట్టుకొని తింటారు. వెలగపండుని కాల్చి గుజ్జుని తీసి అందులో పెరుగు కలిపి తాలింపు పెట్టిన పెరుగు పచ్చడిని ఖాద అంటారని చరకుడు పేర్కొన్నాడు. ఇది క్రీస్తు శకం తొలి శతాబ్దాల నాటి వంటకం.

మొత్తం మీద పాలతోగానీ, పెరుగు లేదా చిక్కని మజ్జిగతోగానీ తయారయిన వంటకాన్ని తిమ్మనం, తేమనం, లేదా తేవనం పేర్లతో పిలిచారని అర్థం అవుతోంది. తెలుగులో 'పామతిమ్మనము' అంటే మజ్జిగ. ప్రబంధరాజ వేంకటేశ్వర విజయ విలాసం గ్రంథంలో గణపవరపు వేంకటకవి 'తిమ్మనలు పాలకాయలు చక్కిలంబులు మోరుండలు..." అంటూ తిమ్మనల్ని ప్రస్తావించాడు. గుజరాతీ తేమనం గురించి మనకు తెలిసింది కాబట్టి. చిక్కని తీపి మజ్జిగలో పునుగు ఉండల్ని నానబెట్టుకొని తిమ్మనలే పేరుతో మనవాళ్లు కూడా వండుకొన్నారని భావించవచ్చు! గట్టిగా తోడు కొన్న పెరుగుని చిలికి, కొత్తిమీర, కొద్దిగా బెల్లం, జీలకర్ర మిరియాల పొడి కలిపి ఇంగువ తాలింపు పెట్టిన పెరుగు పచ్చడిలో గారెలు లేదా పునుగులు వేసి కొద్దిసేపు నాననిస్తే, అవే తేమనలు! ఆవఘాటుతో, పుల్లపెరుగుతో మూర్ధన్యాలు అదిరేలా తెలుగువాళ్లు పెరుగు ఆవడని చేసుకోగా, తియ్యపెరుగుని పల్చగా చేసి జీరా, మిరియాల పొడి కలిపి తేమనల్ని గుజరాతీలు చేసుకొంటారు. అదీ తేడా! మన వాళ్ళు అటు ఆవడల్నీ ఇటు తేమనల్నీ రెండింటినీ ఆస్వాదించారన్న మాట! తియ్య పెరుగు పునుగుల్ని 'తేమనలు'గా భావించవచ్చు. **– డా॥ జి.వి. పూర్ణచందు**

వేడివేడి పెసరపునుకులు, శెనగపప్పు వడలు, జీళ్లు మిఠాయ్ లోయ్– అని నెత్తిమీదపెట్టుకుని వీధివీధికీ ఇంటింటికీ అమ్ముకొచ్చే వారు కరువయ్యారు.

గోమాత పంచమాతల్లో ప్రధానమైనది! గోవధను ఆపకపోతే దేశం గొడ్డుదేశమవుతుంది!

సందమహారాజు, నందవ్రజం, గోపాలబాలుడు చరితల్లో– ఏ ఉత్సవ సందర్భము వచ్చిననూ, వందలూ వేల కొలది గోవులను దానం యిచ్చేవారు. గోదానం కోటి జన్మల పుణ్యాన్ని కలుగచేసింది. మనం గోవులను కబేళాలకు విక్రయిస్తూ, గోమాంస భక్షకులకు విందొనరిస్తూ కోటి పాపాలను మూటగట్టుకుంటున్నాం.

పురాణాలూ... వేదాలూ శాస్త్రాలూ గోపూజ పరమపవిత్రమని. ముక్తినీ, మోక్షాన్నీ ఇస్తుందనీ, ఎక్కడ గోపూజ జరుగుతుందో అక్కడ సకల శుభాలూ వెల్లివిరుస్తాయం టారు. అందుకే పల్లెటూళ్ళల్లో ఇంటింటా గోవులను పెంచుతూ పాడితో సిరి సంపదలతో కళకళలాడుతుంటారు.

భారతీయ జీవన సరళిలో మాతృదేవత తరువాత విశిష్ట స్థానం గోవుది. గోవుకు వేదప్రమాణమైన ప్రాముఖ్యత ఉన్నది. గోక్షీరాన్ని మధిస్తే వచ్చు నెయ్యి, వెన్న దేవతలకు ప్రియమైనవి. యజ్ఞయాగాది క్రతువులందు, పితృకర్మలందు గోదానం చెయ్యడం పరిపాటి. గోవును హింసించరాదు అంటూ సర్వవేదాలు శాసిస్తున్నాయి. గోవులున్న ఇల్లు, రాష్ట్రం, దేశం సమస్త సౌభాగ్యాలతో వర్ధిల్లుతుంది. అందుకే ఇప్పుడు చాలా దేవాలయాల్లో గోకులాన్ని నిర్వహిస్తున్నారు. గోవులను పోషిస్తున్నారు. దేవాలయాలకు అనుబంధంగా ఈ గోపాలన జరుగుతోంది. అన్ని వయసుల వారికి గోక్షీరం ఆరోగ్యాన్నిస్తుంది. కపిలగోవు నుండి లభించే పంచకం అత్యంత పవిత్రమైనవని వేదాలు చెప్తున్నాయి. అవి సాక్షాత్తూ దివ్యౌషధం... అన్నారు.

'గ్రీవా మస్తక సం ధేతు తాసాం గంగా ప్రతిష్ఠితా!
సర్వదేవ మయో గానః సర్వతీర్థ మ యాస్తదా!!

గోవుయొక్క కంఠం, మస్తకం మధ్య గంగ కలదు. గోవు యొక్క సమస్య అంగములందు సమస్త దేవతలు, తీర్థములూ గలవు.

అయితే మరి పట్నాల్లో నిత్యం గోవు దర్శనం కరువే. అందుచేత గోవుని, స్పర్శించి, పూజించాలంటే కొంత డబ్బు చెల్లించాలి. ముంబైలాంటి మహాపట్నాల్లో గుడులు, గోపురాల దగ్గర ఇదో వ్యాపారం. పాపాలు బాపుకునేందుకట! గోవుకు గడ్డి తినిపించి, చిట్టు ఉండలను తినిపించి, ఇంకా వీలైతే అరటిపండును తినిపించడానికి దేవాలయాల దగ్గర ఆవును కట్టి అక్కడే అన్ని అమ్ముతారు. మనం వారికి డబ్బు చెల్లించి వారి దగ్గర గడ్డికొని, చిట్టు ఉండలను, పచ్చగడ్డినీ కొని ఆ గోవుకు తినిపించవచ్చు. దాని తోకను కళ్లకద్దుకోవచ్చు. అక్కడే ఒక సీసాలో గోమూత్రం కూడా ఉంటుంది. మన కోరిక మేరకు సదరు గోపు యజమాని మన తలపై నాలుగు చినుకుల్లా జల్లుతాడు. మనపాపాలన్నీ కడుక్కుపోతాయి. గోవులను ఆలించినందునే కృష్ణుడు గోపాలుడయ్యాడు. ●

గుత్తి వంకాయ కూరోయ్ బావా! కూరలోన కూర్మిగ వలపు కూరినానోయ్ బావా!

కాయకూరల్లో 'వంకాయ'కున్న పేరు ఏ కూరకూ లేదంటారు. **'వంకాయ' వంటి కూరయు, పంకజముఖి సీత వంటి భార్యామణియునే, శంకరునివంటి దైవము, లంకాపతి వైరి వంటి రాజున్ కలరే!** అన్నట్టు వంకాయ కూర వంటి కూర, అల్లం పచ్చిమిర్చీ పెట్టి వండిన కూర, వంకాయ పచ్చడి, వంకాయ పెరుగు పచ్చడి వంటి రుచికరమైనవి మరొకటి లేదంటారు. వంకాయ మన ఆహార దైనందిన జీవితంలో ప్రాశస్త్యాన్ని పొందింది. తెలుగువారినీ, బెంగాలీలను చూడగానే అందరూ వంకాయవైపు దృష్టిని లంగించేవారు.

తమిళదేశంలో వంకాయతో నీరుల్లిపాయిని పెట్టి కూరనే కాదు, సాంబారు కూడా చేసుకుంటారు. పచ్చడిని సైడ్ డిష్‌గా పెట్టుకుని లగాయిస్తారు. వంకాయ లేకుండా భోజనం ఏంవిటోయ్ టెంకాయ్! –అన్నాడొకాయన. వంగతోట దరికి రాకురా వగిలిమారి మాంవయ్యా –అంటుంది ఓ పల్లెపడుచు. ఎక్కడైనా బావకానీ వంగతోట దగ్గర బావ కాదయ్యా –అంటారు. ఇలా ఎన్నో సామ్యాలూ, సామెతలూ వంకాయ్ మీదనే సవాలక్ష ఉన్నాయ్. ఓసారని ఎవరో తోటలోంచి వంకాయలు కోసుకునిపోతూంటే – ఆ ఎర్రబుర్రతనాన్ని చూచి – అక్బర్ ఏంవిటా కాయ అని బీర్బల్‌తో అన్నాడట. ఏంవీ లేదు – అది వంకాయ అన్నాడట. ఏంవిటి దాని నెత్తిపై అలా ఉందని అడిగాడట. బీర్బల్ తిన్నగా ఉండకుండా – అదేనండీ ప్రత్యేకతా ఏ కాయగూరమీద పెట్టని కిరీటాన్ని అల్లా దానికే పెట్టాడు అన్నాడట రుచికి అని చెప్పకుండా! ఆ కాయ విశేషం ఏంవిటి? అంటే 'రుచి' యన్నాడట.

అయితే ఆ గంపలోని వంకాయల్ని తెచ్చి వంటశాలకు పంపండి, కూర వండి అన్నాహారంలో వడ్డించండి అన్నాడట. అప్పుడు మందులూ, మాకులూ వేయకుండా పండించే వంకాయలు కాబట్టి మహా ఫసందుగా ఉండేవి.

అక్బర్ వంటసాలలో దక్షిణాది వంటవాడు ఒకడు – గుత్తి వంకాయ కూరగా వండేసరికి అక్బర్‌గారు నాలుగు మూడు గుత్తి వంకాయల్ని అలాగే లగాయించి తిన్నాడట. అందుకే కాబోల్ను దేవుడు దానికి కిరీటం పెట్టాడన్నారట అక్బరుగారు. నిజమో అబద్ధమే కానీ ఈ కథను కథలోగా ఫసందుగా చెప్పుకుంటూండేవారు. తరువాత రోజుల తరబడి వంకాయ కూర తినీ ఆయనకూ విసుగుపెట్టింది. ఇప్పుడు జన్యుమార్పిడి వంకాయలూ, ఎరువులూ, మందులతో పండించుతున్న వంకాయలూ గుత్తికాయ కూరగా తింటే బాధనిపిస్తోంది. మేడిపండు వోలె నిగనిగలాడుతూ లోపల పుచ్చి ఉంటున్నాయ్. రుచిరహితంగా ఉంటున్నాయ్.

అసలీ వంకాయ అనేది వంగదేశం (బెంగాల్)లో పుట్టిందంటారు. వంగ దేశంలో పుట్టిన కాయ కాబట్టి వంగకాయ, వంకాయ అయింది. అనేక రంగులూ, రూపాల్లో పుట్టడం, పెరగడడం, కొనబడడం, వంటశాలలో వైవిధ్యంగా తరగబడటం వంకాయకే చెల్లింది. అందునా వైలెట్ రంగులో ఉన్న వంకాయ కస్తూరీ వంకాయ అంటారు. దానికి మంచి పేరూ, డిమాండూ – ఆ వైలెట్ మధ్య తెల్లటి చారలుచారలుగా ఉండే వంకాయయైతే మరీ మంచిది. దానినే గుత్తి వంకాయ కూరగా వండుకోవడానికి, కారం మసాలా కూరడానికీ అనువుగా ఉంటుంది. పెద్దగా బొండాంలా ఉన్న కాయ అయితే కాల్చి, పచ్చడి చేసుకోవడానికి, పెరుగుపచ్చడి చేసుకోడానికి, తరిగి బజ్జీలుగా వేసుకోవడానికీ బాగుంటుంది. కానీ మందులు వేసి నిగనిగలాడుతూన్న వంకాయలు, బుగ్గలు పెంచుకున్నట్లు రుచీ, సౌలభ్యమూ ఉండదు. ఇప్పుడు గుత్తి వంకాయ కూరలు వండు ఇల్లాల్లే కరువయ్యారు. హోటల్‌లోని గుత్తికాయ రుచి ఇంట్లోని రుచికి సరికాదు. గుత్తి వంకాయ్ కూరోయ్ బావా అన్న పాత పాటను (సినీమాల్లో కూడా వచ్చింది) వింటూంటే – ఆ కవిగారు ఆ కూరను రసించి రసించి భుజించాడా అనిపిస్తూంది. ●

నిండుగా చీరకట్టే భామలున్నారా భామా!

నిలువవే వాలు కనులదానా
పిరుదులపై వేలాడే – వయారీ వాలు
జడలదానా – మనసున్నదానా!
మగువనుదగుదానా
నీ నడకల హొయల్తో నను నిలదీసేదాన!
ఎందుండి వచ్చావే జాణా –
నీ జడకుచ్చులు జూచీ,
నెమలి శిరపించపు పూలను జూచీ
నీ జడగంటను జూచీ – నెమ్మది లేదె జానా!
నిండారుగ నీ పమిటను జూచీ
నేలకు దిగిన వరూధిననుకుంటిని భామా
తెలుగు దేశానివా, కోస్తాంధ్ర కన్నెవా?
ఈ చీర కట్టెక్కడిదె భామా?
చీరలు కట్టే రోజులు పోయిన రోజుల్లో
భామా – నువు తెలుగు కన్నెగ ఉంటివి భామా
చీర కట్టే భామలు లేని రోజుల్లో
నువ్వు చీరకడితివె భామా–
చీరకు జతగ రవికె తొడిగితివె భామా
నిలువుగ నిండుగ చీరను కట్టీ
చీరకు మించిన రవికెను తొడిగి
నా హృదిని దోచితివె భామా –
నిను చూడని కనులు కనులు కావే భామా!

– 'గోటేటి'



ఆత్మవిశ్వాసం కలిగి వుండండి. మహత్తర కార్యాలు సాధించబడతాయి. - స్వామి వివేకానంద

జీ.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

జనవరి నెల ప్రముఖాంధ్ర కాస్త వైవిధ్యంగా వుంటుందన్నాను, ప్రయత్నించా, కృషి చేశా, మంచి ఫలితాన్నే ఇచ్చిందని భావిస్తున్నా. నాన్నగారి మిత్రులు, శ్రేయోభి లాషులనుండి ఫోన్లు, అభినందనలు వచ్చాయి. అది మాత్రమే కాదు కొంతమంది పత్రిక ఆర్థిక పుష్టికి కొంత పైకాన్ని పంపిస్తూ వారి సపోర్ట్ వుంటుందని పత్రికను నడపమని ప్రోత్సహించారు. నేను రాసిన నా పేజి బావుందన్నారు, అన్ని పేజీలు నావే అయినా జీవీ రావ్ పేజీని అలాగే కంటిన్యూ చెయ్యమని సలహా ఇచ్చారు. కృతజ్ఞతలు, అంతా ఆ ఏడుకొండలవాని వర ప్రసాదం.

వేద విజ్ఞాన వేదిక - గజేంద్ర మోక్షం

చెన్నైలోని ప్రముఖ తెలుగు సంస్థలలో వేద విజ్ఞాన వేదిక ఒకటి. వారు ఆస్కా వారితో సమ్యుక్తంగా నిర్వహించే "తరతరాల తెలుగు కవిత" కార్యక్రమం కోవిడ్ కారణంగా 10నెలల విరామానంతరం జనవరి 31న ఆస్కా గోదావరి హాలులో "గజేంద్ర మోక్షం-పోతన హృదయం" అనే అంశంపై నిర్వహించిన సభకు చెన్నై తెలుగువారు స్పందించి మంచి సంఖ్యలో హాజరయ్యారు. తర తరాల తెలుగు కవిత అని నామకరణం చేసిన కాసల నాగభూషణంగారే ఈ పున:ప్రారంభ సభ ఉపన్యాసకులు. కోవిడ్ నింధనలను పాటిస్తూ ఆ విశాలమైన గోదావరి హాలులో కాస్త దూరదూరంగా కుర్చీలను వేసి, శానిటైజర్ వంటి జాగ్రత్త చర్యలు తీసుకున్న వేద విజ్ఞాన వేదిక సారధులు జే.కె.రెడ్డిగారు, కందనూరి మధుగార్లను అభినందిస్తున్నాం. చెన్నైలో గత 10 నెలలుగా ప్రత్యక్షంగా ఏ సభలు జరగలేదు, ఈ కార్యక్రమానికి తెలుగువారి సంఖ్యా బలం నిర్వాహకులకు ఉత్సాహానిచ్చి మరిన్ని మంచి కార్యక్రమాలు జరగడానికి ఆస్కారం వుంటుంది.

ఇక గజేంద్ర మోక్షం - పోతన హృదయం అంటేనే చక్కటి అద్భుతమైన పద్యాలు మనకు గుర్తుకు వస్తాయి. గజేంద్ర మోక్షం కథ అందరికీ తెలుసున్నదే కాబట్టి కాసలవారు తన ప్రసంగంలో ఎక్కువగా పోతన హృదయాన్నే ఆవిష్కరించారు. పోతన పద్యాలలో చెప్పదలుచుకున్న విషయం మన కళ్ళముందు చక్కగా దృశ్యకావ్యంలా ఆవిష్కరింపబడుతుందని, అదే పోతన ప్రత్యేకత అని కొన్ని ఉదాహరణలను చెప్పారు.

ముక్తి మరణాంతరం వచ్చేది కాదు, బ్రతికుండగానే సాధించవలసిన స్థితి, దీనిని తెలియజెప్పే కథనమే గజేంద్ర మోక్షం. పూర్వజన్మలవల్ల ప్రోగు చేసుకున్న భోగలాలస్వతముతో కూడుకున్న "అహం" మొసలి. జనన మరణ చక్రంలో అనేకసార్లు పడిలేస్తున్న మానవుడు ముక్తి పొందాలంటే తన శక్తి మాత్రమే చాలదు. పరమాత్మ అనుగ్రహశక్తి పరిపూర్ణంగా కావాలి అన్నది గజేంద్రుడు. పరమాత్మ పలికేంతవరకూ ప్రార్థన ఆపకూడదు గజేంద్రుడి వలే.

గజేంద్రుడు మొదటగా తాను గజరాజునని తన బలాన్ని నమ్ముకుని అటుపై కుదరక వేడుకుంటూ అహం సమర్పణ చేస్తూ శరణాగతి స్థికి రావడం, ఆ మహావిష్ణువు భక్తుని మొరనాలకించి సుదర్శన చక్రాన్ని ప్రయోగించి మొసలిని వధించి గజరాజుని కాపాడడమే గజేంద్ర మోక్షం. ఒక మంచి అంశం, మంచి వక్త, చక్కటి శ్రోతలతో సభ రక్తి కట్టింది.

మరోమారు జేకే రెడ్డి, మధు గార్లను, తన ప్రసంగంతో ఆకట్టుకున్న కాసలవారిని అభినందిస్తున్నాం. ●

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని - చెన్నై

అతులిత పుష్ప పల్లవ ఫలాన్విత
భూరుహ భూరివల్లరీ

- మన మాతృభాష ఔన్నత్యం అభివ్యక్తీకరించడం,
ప్రతి ఉషస్సున లేవగానే
పాఠకులపై భారం వేయరాదని,
ఆరాధించడమనే తపనం, తపస్సు!
అర్ధ, వృద్ధ భారాన్ని మోస్తూనే

314 నెలలుగా
314 సంచికలను

శ్రీ వేంకటేశ చరణౌ చరణం ప్రపద్యే।

ప్రముఖాంధ్ర

- వెలువరించ కలిగిదందంటే ఏడుకొండల తేడు కృప! వాగ్దేవి యిచ్చిన శక్తి!

'ప్రముఖాంధ్ర' వెబ్ ఎడిషన్ చూచినవారు
పాత పత్రికలను చూచినవారూ 'ప్రముఖాంధ్ర' కోరుతున్నారు.
కోరినవారందరికీ పంపాలనే ఉన్నది.
ధనసంపత్తి కలవారూ, మన సంపత్తి కలవారూ
ప్రముఖాంధ్ర నిధికి యధోచితంగా సహకరించండి.
రు.10000లు మించి పంపించిన ప్రదాతల పేర్లను
వారి ఫోటోలతో ప్రచురిస్తాం.
(ఉడతా భక్తిగా చిన్న విరాళములనూ పంపవచ్చు)

గోటేటి శ్రీరామారావు
స్థాపక సంపాదకుడు

చిరునామా:
16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 600 033.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com

Date of Publication - 3rd of every month
PRAMUKHANDHRA
February 2021

REGN. No. TN/CC(S)DN/177/18-20
Licensed to Post without Prepayment. WPP No. TN/PMG(CCR)WPP-656/15-17
Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97

GOTETI GRAPHICS

64 (16), Thambiah Road
West Mambalam
Chennai - 600 033
INDIA

☎ : 044 2474 2091 / 2371 6322
✆ : 098400 48941
E-mail : gotetigraphics@gmail.com

Our print support creates a remarkable value in your business